నీలగిరి నిత్యపద్యం
ఆటవెలది

కోరికలును జూడ గుర్రాలవోలెను
పరిణమించె నేడు వధువులకును
ఆస్థిపాస్థులున్న ,అందచందములును
తప్పనిసరి యనుచు చెప్పుచుండ్రి

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్ఛార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్ఛార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్ఛార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 357 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 24-04-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


## ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే

# మాకు ముఖ్యం

### క్షణికావేశంలో ప్రాణాలు తీసుకోవద్దు

- సీఎం రేవంత్ నేతృత్వంలోని క్యాబినెట్ భేటీ
- వివరాలు వెల్లడించిన మంత్రులు పొన్నం, శ్రీధర్ బాబు
- ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులతో నేడు డిప్యూటీ సీఎం నేతృత్వంలో చర్చలు
- పలు సూచనలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- కాళేశ్వరం తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్లాలని క్యాబినెట్ నిర్ణయం

హైదరాబాద్,

ఆర్టీసీ కార్మికుల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు మంత్రివర్గ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి తెలిపారని.. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సుదీర్ఘ క్యాబినెట్ సమావేశం తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికులకు కీలక విజ్ఞప్తి చేశారు. కార్మికులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి సంబంధించి ప్రభుత్వం పూర్తిగా సానుకూలంగా ఉన్నామని వివరించారు. ఉద్యోగ భద్రతపై ఎలాంటి అపోహలు వద్దని, ఒక్క ఉద్యోగిని కూడా ప్రభుత్వం తొలగించబోదని స్పష్టం చేశారు.

-మిగతా 2 లో





## బెంగాల్లో ఇక అధికారం

# బిజెపిదే

- మే 5న దీదీ ఆట ముగుస్తుంది
- భాజపా ప్రభుత్వం పూర్తి మెజార్టీతో ఏర్పాటవుతుంది.
- చొరబాట్లను పూర్తిగా నిరోధిస్తాం
- ఎన్నికల ప్రచారంలో అమిత్ షా కీలక వ్యాఖ్యలు

కోల్‌కతా

పశ్చిమ బెంగాల్‌లో ఈసారి అధికారం భాజపాదేనని కేంద్ర హోంమంత్రి అమిత్ షా విశ్వాసం వ్యక్తం చేశారు. తొలి విడత పోలింగ్ ముగుస్తున్న తరుణంలో బెంగాల్‌లో తాము పూర్తి మెజార్టీతో ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్నామని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం రాగానే చొరబాట్లను పూర్తిగా కట్టడి చేస్తామని అన్నారు. ఇంతకాలం మమతా బెనర్జీ చొనబాట్లను ప్రోత్సహిస్తూ దేశ బవిష్తయ్‌కు సవాల్ విసిరారని మండిపడ్డారు. హుగ్లీ జిల్లాలోని బాలాగఢ్‌లో ఏర్పాటు చేసిన రెండో విడత ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. మే 5న దీదీ ఆట ముగుస్తుంది. భాజపా ప్రభుత్వం పూర్తి మెజార్టీతో ఏర్పాటవుతుంది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ, భద్రతకు చొరబాటుదారులు హాని కలిగిస్తున్నారు. బెంగాల్ యువత ఉద్యోగాలు, పేదల రేషన్‌ను దోపిడీ చేయడంతో పాటు దేశ భద్రతను దెబ్బతీసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఏప్రిల్ 29న (రెండో విడత ఎన్నికల్లో)

-మిగతా 2 లో

## రెండోరోజూ కొనసాగిన ఆర్టీసీ సమ్మె

- ఎక్కడిక్కడే నిలిచిపోయిన బస్సులు
- బలవంతంగా నడిపేందుకు యత్నాలు
- పలుచోట్ల కార్మికులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రెండో రోజు ఆర్టీసీ కార్మికుల సమ్మె గురువారం కూడా కొనసాగింది. ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితం కావడంతో ప్రయాణికులు నానా యాతన పడుతున్నారు. తమ న్యాయమైన హక్కుల కోసం ఉద్యమిస్తున్న ఆర్టీసీ కార్మికులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నది. పోలీసుల పహారాలో బస్సుకు ఒక కానిస్టేబుల్‌ను పెట్టి బలవంతంగా బస్సులను నడుపాలని చూస్తున్నది. అయినప్పటికీ ఆర్టీసీ కార్మికులు

-మిగతా 2 లో

## నేటినుంచి స్కూళ్లకు

# వేసవి సెలవులు

- తిరిగి జూన్ 12న పాఠశాలలు ప్రారంభం
- ఆర్టీసీ సమ్మెతో గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి

2 లో



## వాంఖడేలో సీఎస్కే విజయ గర్జన..

- సొంతగడ్డపై ముంబైకి అవమానకర ఓటమి..!
- 103 రన్స్ తేడాతో ముంబై చిత్తు
- 5వ ప్లేసుకు దూసుకెళ్లిన సీఎస్కే



న్యూఢిల్లీ

ఐదుసార్లు ఛాంపియన్లు ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య జరిగిన మ్యాచులో సీఎస్కే ఘన విజయం సాధించింది. ముంబైలోని వాంఖడే క్రికెట్ స్టేడియంలో ఈ మ్యాచ్ జరగ్గా.. బ్యాటింగ్, బౌలింగ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ అదరగొట్టింది. ఈ సీజన్‌లో పేలవ ప్రదర్శన చేస్తున్న ఆ జట్టు.. కీలక మ్యాచులో సత్తాచాటింది. తొలుత బ్యాటింగ్ చేసి 6 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. అనంతరం ముంబైని 104 పరుగులకే కుప్పకూల్చి.. భారీ విజయం సాధించింది. రెండు పాయింట్లతో పాటు భారీగా నెట్ రన్ రేట్‌ను మెరుగుపర్చుకుంది.టార్గెట్ 208 ఉన్నప్పటికీ ఆదేది.. వాంఖడేలో కాబట్టి ముంబై ఇండియన్స్ విజయంపై ధీమాగానే ఉంది. కానీ ఇన్నింగ్స్

-మిగతా 2 లో

## తన గూడు తానే నిర్మించుకునే కప్ప



### అరుణాచల్‌లో సరికొత్త కప్ప జాతి


న్యూఢిల్లీ:

తన ఇంటిని తానే నిర్మించుకోగల అరుదైన, సరికొత్త కప్ప జాతిని అరుణాచల్ ప్రదేశ్‌లో సైంటిస్టులు కనుగొన్నారు. ఇక్కడి నామ్‌దఫా టైగర్ రిజర్వ్‌లో 'లిమ్నోనెక్టెస్ మోతీజీల్' అనే అరుదైన, కోరలున్న కప్పను గుర్తించారు. ఈ జాతి కప్పలు భూమి లోపల గూళ్లు కట్టుకుంటాయి.

-మిగతా 2 లో

## కుబేర భారతం

- ఐదేండ్లలో 313 బిలియనీర్లకు చేరొచ్చు
- ప్రస్తుతం 207 మంది సంపన్నులు
- నైట్‌ఫ్రాంక్ రిపోర్ట్ విడుదల



న్యూఢిల్లీ

దేశంలో అధిక ధరలతో సామాన్యుల ఆదాయాలు హరించుకుపోతుంటే.. మరోవైపు అపర కోటీశ్వరులు భారీగా పెరుగుతున్నారు. ప్రపంచవ్యా ప్తంగా భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, వడ్డీరేట్ల పెంపు భయాలు, ఆర్థిక అసమానతలు ఉన్నప్పటికీ ప్రపంచవ్యాప్తంగా సంపన్నులు అమాంత పెరుగుతున్నారని అంతర్జాతీయ ప్రాపర్టీ కన్సల్టెంట్ నైట్ ఫ్రాంక్ తాజాగా ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. ఈ రిపోర్ట్ ప్రకారం..

-మిగతా 2 లో

## బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో

# భాజపాదే విజయం

- మే4న రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతాం
- ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడం విశేషం
- నదియాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాన మోదీ



కోల్‌కతా,

బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా తప్పకుండా విజయం సాధిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతామని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని నదియాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. గతంలో మనం చూసుకుంటే భారీగా ఓటింగ్ జరిగిన ప్రాంతాల్లో భాజపా ఘన విజయం సాధించింది. బెంగాల్‌లో కూడా మే 4న భాజపా చరిత్ర సృష్టించనుంది. ఆ తర్వాత రాష్ట్రమంతా మిఠాయిలు పంచి వేడుక చేసుకుందాం. దాంతో పాటు ఝాల్‌ముఢీ కూడా పంచుతాం. ఈ మధ్యే నేను విన్నాను. ఝాల్‌ముఢీ కొందరికి షాక్ కొట్టించింది. అది నేను తింటే మంట మాత్రం టీఎంసీకి తగిలిందని వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. అయిదు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నానని, ఈ ఎన్నికల్లో మాత్రమే హింస తక్కువగా జరిగిందని పేర్కొన్నారు. ఎన్నికలు ఇంత ప్రశాంతమైన వాతావరణంలో కొనసాగడం కీలకమైన పరిణామం అన్నారు. పశ్చిబెంగాల్ లో అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ కి ఝుల్మురి భయంకరమైన

-మిగతా 2 లో



## ఇరాన్ నౌకలను

# కాల్చిపారేయండి

- హార్ముజ్‌పై ట్రంప్ కీలక ఆదేశాలు
- నిర్బంధించినంత వరకూ తెరిచేది లేదు : ఇరాన్
- యుద్ధంతో పతనం దిశగా ఆర్థికవ్యవస్థ
- ఎస్‌పీ గ్లోబల్ పర్చేజింగ్ సంస్థ వెల్లడి

వాషింగ్టన్

అమెరికా, ఇరన్‌ల మధ్య కాల్పుల విరమణ అమల్లోనే ఉన్నా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కీలక ఆదేశాలు జారీ చేశారు. హార్ముజ్ జలసంధిలో ఇరాన్ నౌకలు మందుపాతరలు (సిమైన్స్) అమర్చుతున్నాయని, వాటిని గుర్తించి దాడి చేయాలని అమెరికా నౌకాదళాన్ని ఆయన ఆదేశించారు. ఈ మేరకు సోషల్ ట్రూత్‌లో పోస్ట్‌చేశారు. 'హర్ముజ్ జలసంధిలో మైన్లను పెడుతున్న ఏ చిన్న పడవైనా సరే కాల్చి ధ్వంసం చేయాలని నావికా దళాన్ని ఆదేశించాను. ఈ విషయంలో ఏమాత్రం సంకోచించొద్దని చెప్పా. అమెరికా మైన్ స్వీపర్లు ప్రస్తుతం జలసంధిని క్లియర్ చేస్తున్నాయి. ఈ కార్యాచరణను మూడు రెట్లు అధిక వేగంతో కొనసాగించాలని ఆదేశిస్తున్నాను" అని పేర్కొన్నారు. అంతేకాకుండా హార్మూజ్ జలసంధి తమ ఆధీనంలోనే ఉందని ప్రకటించారు. నౌకల రాకపోకలు అమెరికా నేవీ అనుమతితోనే జరుగుతాయని ట్రంప్ రాసుకొచ్చారు. ఇరాన్ ప్రస్తుతం తమ నాయకుడు ఎవరో తేల్చుకొనేందుకు తీవ్ర ఇబ్బంది పడుతోంద న్నారు. అమెరికా నేవీ అనుమతి లేకుండా నౌకల రాకపోకలు జరగవన్నారు. ఇరాన్ తమతో ఒప్పందానికి వచ్చేంతవరకు నిర్బందం కోనసాగుతుందని తెలిపారు అయితే కొద్దిరోజుల క్రితం ఆయనే స్వయంగా కాల్పుల విరమణను పొడిగిస్తూ ప్రకటించిన సంగతి తెలిసిందే.


-మిగతా 2 లో

## పోటెత్తిన

# ఓటర్లు

### రికార్డ్ స్థాయిలో పోలింగ్

- 90శాతం కొట్టిన బెంగాల్ ఓటర్లు.. తమిళనాడులో 82 శాతం..
- సాయంత్రం 5 గంటలకు క్యూ లైన్లలో భారీగా ఉన్న ఓటర్లు..
- ఉదయం 7 గంటలకే ప్రారంభమైన పోలింగ్
- ఎండను సైతం లెక్క చేయకుండా భారీ సంఖ్యలో ఓటర్లు
- తొలి గంటల్లోనే ఓటు హక్కును వినియోగించుకున్న పలువురు ప్రముఖులు




కోల్‌కతా :

పశ్చిమ బెంగాల్‌లో తొలి విడత పోలింగ్ భారీ రికార్డుల్ని క్రియేట్ చేస్తోంది. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఓటర్లు పోలింగ్ సెంటర్ల ముందు బారులు తీరారు. సాయంత్రం 5 గంటల వరకు బెంగాల్‌లో 90 శాతం (89.93%) ఓటింగ్ నమోదైంది. చాలా మంది ఇంకా క్యూ లైన్లలో నిలిచి ఉండటంతో ఈ పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. తొలి విడతలో భాగంగా బెంగాల్‌లో 152 స్థానాలకు గురువారం ఓటింగ్ జరిగింది.

-మిగతా 2 లో



## కాళేశ్వరంపై రెండో రోజూ సంబురాలు..

- హైకోర్టు తీర్పుతో ఆనందోత్సాహాలు
- పటాకులు కాల్చిన బీఆర్ఎస్ శ్రేణులు
- పలుచోట్ల క్షీరాభిషేకాలు, జలాభిషేకాలు

హైదరాబాద్

కాళేశ్వరంపై జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక చెల్లదని హైకోర్టు సంచలన తీర్పునివ్వడంతో రెండో రోజైన గురువారం కూడా రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు సంబురాలు జరుపుకొన్నాయి. ఈ సందర్భంగా పటాకులు కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. కేకులు కట్ చేశారు. పార్టీ అధినేత కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం, జలాభిషేకాలు నిర్వహించారు. మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలోని చౌరస్తా వద్ద కేసీఆర్, హరీశ్‌రావు చిత్రపటాలకు బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి క్షీరాభిషేకం చేశారు.నారాయణపేట జిల్లా

-మిగతా 2 లో

# బెంగాల్లో ఇక అధికారం బిజెపిదే

మొదటి తరువాయి

కమలం గుర్తుపై ఓటేయండి. ఇది మీరు కేవలం ఎవరో ఒకరిని ఎమ్మెల్యేని చేసేందుకో, భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికో కాదు.. చొరబాటుదారుల నుంచి బెంగాల్‌కు విముక్తి కల్పించడానికి. ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక బెంగాల్‌లోకి ఎవరూ చొరబడలేరు. ఇప్పటికే అక్రమ వలసదారులను భాజపా బయటకు పంపిస్తోందని అన్నారు. మరోవైపు, బెంగాల్‌లో జరుగుతున్న తొలి విడత ఎన్నికల్లో భారీగా పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నం 3గంటల సమయానికి 78.77శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం 16 జిల్లాల పరిధిలోని 152 నియోజకవర్గాల్లో ఈ రోజు ఉదయం 7గంటలకు పోలింగ్ మొదలైన విషయం తెలిసిందే. చివరి వార్తలు అందేసరికి బెంగాల్లో 79శాతం ఓటింగ్ నమోదైనట్లు తెలుస్తోంది.

## నేటినుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

- తిరిగి జూన్ 12న పాఠశాలలు ప్రారంభం
- ఆర్టీసీ సమ్మెతో గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి



హైదరాబాద్,
తెలంగాణలోని పాఠశాల విద్యార్థులకు వేసవి సెలవుల సందడి మొదలైంది. పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. గురువారం 23తో ప్రస్తుత విద్యా సంవత్సరం అధికారికంగా ముగిసింది. శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వేసవి విరామం ప్రారంభం కానుంది. ప్రభుత్వ క్యాలెండర్ ప్రకారం, ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు సెలవులు కొనసాగుతాయి. దాదాపు 50 రోజుల సుదీర్ఘ విరామం తర్వాత, జూన్ 12న పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయి. సాధారణంగా ఏప్రిల్ నెలాఖరు వరకు తరగతులు నిర్వహించేవారు, కానీ ఈసారి ఎండలు తీవ్రమవుతుండటంతో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగానే సెలవులు ప్రకటించారు. విద్యా సంవత్సరం చివరి రోజైన గురువారంతో తరగతులు ముగియనుండటంతో, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ ఒక ముఖ్యమైన ఆదేశాన్ని జారీ చేసింది. అన్ని ప్రభుత్వ స్కూళ్లు, మోడల్ స్కూళ్లు , కేజీబీవీలలో 'తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల సమావేశం' నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశాల్లో విద్యార్థుల ప్రగతి నివేదికలను అందజేయడమే కాకుండా.. వేసవి కాలాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో చర్చించారు. వరుస పరీక్షల ఒత్తిడి తర్వాత విద్యార్థులకు ఈ 50 రోజుల సెలవులు గొప్ప ఉపశమనాన్ని ఇస్తాయి. అయితే ఎండలు ఎక్కువగా ఉన్నందున, పిల్లలు బయట తిరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. మొత్తానికి సందడి, కేరింతల మధ్య పిల్లల వేసవి విడిది రేపటి నుంచే ప్రారంభం కాబోతోంది. అయితే ఆర్టీసీ సమ్మెతో గ్రామాలకు వెళ్లాలనుకున్న వారికి తీవ్రనిరాశ ఎదురయ్యింది. సమ్మెతో ఊళ్లకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. సమ్మె ముగిస్తేనే ఎక్కడికైనా వెళ్లడానికి అవకాశం ఉంటుంది.

## వాంఖడేలో సీఎస్కే విజయ గర్జన..

మొదటి తరువాయి

ప్రారంభమైన కాసేపటికే ముంబై పీకల్లోతు కష్టాల్లో పడింది. రోహిత్ శర్మ గైర్హాజరీలో తుది జట్టులోకి వచ్చిన దానిష్ మలేవర్ (0) మరోసారి నిరాశపరిచాడు. సూపర్ ఫామ్‌లో ఉన్న నమన్ ధీర్ (0), క్వింటన్ డికాక్ (7) సైతం తొలి 3 ఓవర్లలోనే పెవిలియన్ చేరిపోయారు. దీంతో 11 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి.. ముంబై పీకల్లోతు కష్టాల్లో పడింది.సూర్యకుమార్ యాదవ్ (30 బంతుల్లో 36 రన్స్), తిలక్ వర్మ (29 బంతుల్లో 37 రన్స్) ఎక్కువ సేపు క్రీజులో ఉన్నా.. ధాటిగా రన్స్ చేయలేకపోయారు. ఆఖర్లో భారీ షాట్లకు ప్రయత్నించి ఔటై పోయారు. హార్దిక్ పాండ్యా (1), షెర్ఫాన్ రూథర్ ఫోర్డ్ (0) కూడా విఫలం కావడంతో ముంబై ఓటమి ఖరారైపోయింది. చివరకు ముంబై ఇండియన్స్.. సరిగ్గా 19 ఓవర్లలో 104 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో ముంబై ఇండియన్స్‌పై చెన్నై సూపర్ కింగ్స్.. 103 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఐపీఎల్‌లో పరుగుల పరంగా సీఎస్కేకు ఇదే అతిపెద్ద విజయం కావడం గమనార్హం. ఈ మ్యాచ్ విజయంతో చెన్నై సూపర్ కింగ్స్ ఈ టోర్నీలో మూడో గెలుపును రుచి చూసింది. 103 పరుగుల తేడాతో గెలవడంతో భారీగా నెట్ రన్ రేట్ కూడా దక్కింది. దీంతో పాయింట్స్ టేబుల్‌లో సీఎస్కే.. 8వ ప్లేసు నుంచి 5వ స్థానానికి ఎగబాకింది. ముంబై ఇండియన్స్.. ఏడు మ్యాచులలో కేవలం 2 విజయాలు మాత్రమే సాధించింది. 8వ ప్లేసులో నిలిచింది.

## కుబేర భారతం

మొదటి తరువాయి

దేశంలోని బిలియనీర్ల సంఖ్య రాబోయే ఐదేండ్లలో 51 శాతం పెరిగి 313కు చేరుకోనుంది. 2026 ప్రారంభంలో 207గా ఉన్న ఈ సంఖ్య.. 2031 నాటికి భారీగా పెరగనుంది. ఈ వృద్ధి రేటు ప్రపంచ ఆర్థిక శక్తులైన చైనా (20 శాతం), అమెరికా (12 శాతం) కంటే ఎంతో ఎక్కువగా ఉండటం గమనార్హం. కేవలం బిలియనీర్లే కాకుండా సుమారు రూ.250 కోట్ల కంటే ఎక్కువ ఆస్తి ఉన్న అల్ట్రా రిచ్ వ్యక్తుల సంఖ్య కూడా మన దేశంలో 25,217కు చేరుకుంటుందని ఈ నివేదిక అంచనా వేస్తోంది. ప్రస్తుతం ప్రపంచ బిలియనీర్లలో భారత్ వాటా 6.7 శాతంగా ఉండగా.. 2031 నాటికి ఇది 8 శాతానికి పెరుగుతుందని అంచనా. ఇప్పటికే 914 మంది బిలియనీర్లతో అమెరికా, 485 మందితో చైనా మొదటి రెండు స్థానాల్లో ఉండగా, 207 మందితో భారత్ ప్రపంచంలోనే మూడవ స్థానంలో నిలిచింది. గడిచిన ఐదేండ్లలో సగటున ప్రతి రోజూ 89 మంది అల్ట్రారిచ్ జాబితాలో చేరారు. సాధారణంగా 30 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.250కోట్లు) కంటే ఎక్కువ నికర సంపద కలిగిన వారిని అల్ట్రా రిచ్‌గా పిలుస్తారు. 2021లో ప్రపంచవ్యాప్తంగా ఈ అల్ట్రా రిచ్ వ్యక్తుల సంఖ్య 5.51లక్షలుగా ఉండగా.. ప్రస్తుతం 7,13,626కు పెరిగింది. కాగా.. భారత్‌లో ప్రస్తుతం 19,877 అల్ట్రా రిచ్ వ్యక్తులు ఉండగా.. వచ్చే ఐదేండ్లలో ఈ సంఖ్య 25,217కు చేరనుంది. ఈ జాబితాలో భారత్ ప్రపంచవ్యాప్తంగా ఆరో స్థానంలో ఉంది. ధనవంతులు తమ సంపదను కేంద్రీకరించడానికి రియల్ ఎస్టేట్‌ను ప్రధాన మార్గంగా ఎంచుకుంటున్నారు. ప్రతి అత్యంత ధనవంతుడు సగటున 3.7 నివాసాలను కలిగి ఉన్నాడు. వారి మొత్తం సంపదలో 21 శాతం వాటా కమర్షియల్ రియల్ ఎస్టేట్‌లోనే ఉంది. దేశంలో ఒకవైపు బిలియనీర్ల సంఖ్య పెరుగుతుంటే.. మరోవైపు సామాన్యుడి ఆదాయాలు ద్రవ్యోల్బణం దెబ్బకు కరిగిపోతున్నాయి. నివాస స్థలాల ధరలు పెరగడం వల్ల ప్రధాన నగరాల్లో సాధారణ ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతోంది. దేశ వృద్ధి రేటు గణాంకాల్లో కనిపిస్తున్నప్పటికీ దాని ఫలాలు అట్టడుగు వర్గాలకు అందడం లేదని ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సంపద కేవలం కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమవ్వడం వల్ల సమాజంలో ఆర్థిక అంతరాలు మరింత పెరుగుతున్నాయని అనేక రిపోర్టులు వెల్లడిస్తున్నాయి.

## ఇరాన్ నౌకలను కాల్చిపారేయండి

మొదటి తరువాయి

కాని ట్రంప్ నుంచే దాడి చేయలంటూ ఆదేశాలు రావడం గమనార్హం. మరోవైపు అమెరికా నిర్బంధం కొనసాగుతున్నంత కాలం హార్మూజ్ జలసంధిని తెరిచే ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఇప్పటికే ఈ యుద్ధంతో హార్మూజ్ జలసంధి ఉద్రిక్త ప్రాంతంగా మారిపోయింది. అలాగే ఇరాన్ సముద్రంలో అమర్చిన సిమైన్స్ తీయడం అంత సులభం కాదని, వాటిని తీసేందుకు కనీసం 6 నెలల సమయం పడుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే 35 కి.మీ వెడల్పు ఉండే హార్మూజ్ జలసంధి కోసం అగ్రరాజ్యం అల్లాడిపోవడం, అనేక దేశాల్లో చమురు ధరలుపై ప్రభావం పడటం ఈ జలసంధి ప్రాముఖ్యతను తెలుపుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు..

# ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే మాకు ముఖ్యం

మొదటి తరువాయి

కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం, సంస్థ పరిరక్షణ ప్రకారమే పనిచేస్తున్నామని, క్యాబినెట్ లో మంత్రులంతా కార్మికులకు అనుకూలంగా చర్చించారన్నారు. కాగా, ఆర్టీసీలో పనిచేసే ప్రతి కార్మికుడికి మంత్రి శ్రీధర్ బాబు కూడా కీలక విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యలు, ధర్నాలపై క్యాబినెట్ లో కీలకంగా చర్చించామని తెలిపారు. కార్మికులు సంయమనంతో ఉండాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తప్పకుండా చర్యలు చేపడుతుందన్నారు. అంతవరకూ ఎలాంటి తొందరపాటు చర్యలకు పాల్పడవద్దని, ఎవ్వరూ ప్రాణాలు తీసుకోవద్దని కోరారు. ఇలాంటి ఆలోచనలు చేయవద్దన్నారు.
కష్టపడి రాష్ట్రాన్ని సాధించుకున్నది ఇలా ఆత్మహత్యలు చేసుకునేందుకు కాదన్న విషయం గుర్తుంచుకోవాలని, క్షణికావేశంతో కుటుంబాలకు అన్యాయం చేయవద్దన్నారు. ప్రజాపాలన ప్రభుత్వంపై నమ్మకం ఉంచాలని కోరారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రుల బృందం నేడు శుక్రవారం ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులను చర్చలకు ఆహ్వానించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని సీఎం స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో తెలంగాణ క్యాబినెట్ సమావేశం గురువారం మధ్యాహ్నం 3 గంటలకు మొదలై సాయంత్రం వరకు భేటీ అయింది. రాష్ట్రంలోని తాజా పరిణామాలతో



పాటు ఆర్టీసీ సమ్మె సహా పలు కీలక అంశాలపై మంత్రివర్గం హాట్ హాట్ గా చర్చించింది. కాళేశ్వరంపై హైకోర్టు తీర్పు, ఆర్టీసీ కార్మికుల సమ్మె ప్రభుత్వంలో విలీనం అంశాలపై చర్చించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం అమలుతో పాటు నీటిపారుదల ప్రాజెక్టుల అంశాలు, గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై చర్చించినట్లు చెబుతున్నారు. అలాగే ఫిట్ మెంట్, పెండింగ్ డీఏలు, యాసంగి ధాన్యం, మొక్కజొన్నల సేకరణపై క్యాబినెట్ లో చర్చ జరిగిందని తెలుస్తోంది. కాగా రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోనే కీలక ప్రకటన చేశారు. గురువారం నాటి క్యాబినెట్ భేటీలో ఆర్టీసీ సమ్మెపై చర్చ జరిగిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఆర్టీసీ కార్మికులు ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రాణాలు తీసుకోవడం వల్ల సమస్య పరిష్కారం కాదని.. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో దృష్టి పెట్టిందని సీఎం ప్రకటించారు.

### కాళేశ్వరం తీర్పుపై సుప్రీంకోర్టుకు తెలంగాణ ప్రభుత్వం

కాళేశ్వరం ప్రాజెక్టు తీర్పు నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కాళేశ్వరం తీర్పును సవాలు చేస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని ఏజీకి సర్కార్ నిర్ణయించింది. ఇప్పటికే న్యాయ విభాగంతో చర్చలు పూర్తయ్యాయని, తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నట్లు క్యాబినెట్ వర్గాలు తెలిపాయి. ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలపై న్యాయస్థానంలో పూర్తి వివరాలు సమర్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లోనూ, పాలనా వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ పై దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెల్లడించిన సంగతి తెలిసిందే. కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్, మాజీ ఐఏఎస్ ఎస్.ఏ జోషిలపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అంతేకాకుండా, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణలో పలు నిబంధనలు పాటించలేదని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో కమిషన్ నివేదిక ఆధారంగా ముందస్తు చర్యలు చేపట్టరాదని స్పష్టం చేసింది.


# రెండోరోజూ కొనసాగిన ఆర్టీసీ సమ్మె

మొదటి తరువాయి

తెల్లవారుజాము నుంచే బస్సుల వద్దకు చేరి ఒక్క బస్సును కూడా కదలనీయలేదు. పోలీసులు బలవంతంగా ఆర్టీసీ కార్మికులను అరెస్ట్ చేసినా ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. బస్సులు లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రజలను ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణికులు అధిక ధరలు చెల్లించ ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. మెదక్ ఆర్టీసీ డిపో నుంచి ఈరోజు తెల్లవారుజామున బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ప్రయత్నం చేయగా కార్మికులు అడ్డుకోవడంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. గురువారం తెల్లవారుజామున ఆర్టీసీ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య బస్సులు నడిపేందుకు డిపో నుంచి బస్టాండ్ వరకు బస్సులు తీసుకురాగా కార్మికులు సమాచారం తెలుసుకొని భారీ సంఖ్యలో చేరుకొని అడ్డుకున్నారు. ఆర్టీసీ బస్సులను అడ్డుకోవడంతో పోలీసులు కార్మికులను బలవంతంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9డిపోల్లో 600 వందల బస్సులు నిలిచి పోయాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సమ్మె కొనసాగుతున్నది. కామరెడ్డి జిల్లాలో ఆర్టీసీ కార్మికుల టెంట్‌ను పోలీసులు తొలగించడంతో వివాదం చోటు చేసుకుంది. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా రెండో రోజు బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. సిద్దిపేట జిల్లాలోని సిద్దిపేట, హుస్నాబాద్, దుబ్బాక, గజ్వేల్ డిపోల ఎదుట ఆర్టీసీ కార్మికులు డిపోల ఎదుట ధర్నా చేపట్టారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో బస్సులు నడుపాలని చూడగా ఆర్టీసీ కార్మికులు అడ్డుకున్నారు. మహబూబా బాద్ జిల్లాలో ఆర్టీసీ కార్మికులపై పోలీసుల అత్యుత్సాహం ప్రదర్శించారు. రెండో రోజు సమ్మె కొనసాగు తుండగా తొర్రూరు డిపో వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించారు. విధులకు రాని 21 మంది కార్మికులపై కేసు నమోదు చేశారు. సమ్మెలో పాల్గొనేందుకు డిపో వద్దకు వస్తున్న కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. ఆర్టీసీ ఉద్యోగులను అరెస్ట్ చేసి కేసులు నమోదు చేయడంపై ఉద్యోగ సంఘాల నేతలు మండిపడుతున్నారు. తక్షణమే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# పోటెత్తిన ఓటర్లు

మొదటి తరువాయి




బెంగాల్‌లో మొత్తం అసెంబ్లీ నియోజకవర్గాలు 294 కాగా, రెండోదైన చివరి విడత పోలింగ్ 142 స్థానాలకు ఏప్రిల్ 29న జరుగుతుంది. పోలింగ్ సరళిని చూస్తే అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), ప్రతిపక్ష బీజేపీకి మధ్య హోరాహోరీ పోరు జరిగినట్లు తెలుస్తోంది. బెంగాల్ మొదటి విడత ఎన్నికల్లో 1478 మంది అభ్యర్థులు పోటీ చేశారు. బెంగాల్ ఎన్నికల్లో మరోవైపు హింస చెలరేగింది. ముర్షిదాబాద్‌లో టీఎంసీ కార్యకర్తలు ఏయూజేపీ పార్టీ చీఫ్ హుమాయున్ కబీర్‌పై దాడులు చేశారు. సిలిగురిలో టీఎంసీ, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. కుమార్‌గంజ్‌లో బీజేపీ అభ్యర్థి సువేందు సర్కార్‌పై టీఎంసీ గుండాలు దాడికి పాల్పడ్డారు. మరోవైపు, ఈ ఓటింగ్ చూస్తే ఎన్ఆర్సీ ప్రక్రియ, ఓట్ల తొలగింపుపై ప్రజల కోపాన్ని సూచిస్తోందని ఇది టీఎంసీకి అనుకూలమే అని సీఎం మమతా బెనర్జీ కామెంట్ చేసింది. మరోవైపు, మే 4 టీఎంసీకి గుడ్ బై అంటూ బీజేపీ చెబుతోంది. మరోవైపు, తమిళనాడులో ఒకే విడతలో మొత్తం 234 స్థానాలకు ఓటింగ్ జరిగింది. సాయంత్రం 5 గంటల వరకు ఆ రాష్ట్రంలో 82.24 శాతం ఓటింగ్ నమోదైంది. గంటగంటకు పోలింగ్ పెరుగుతుండటంతో అధికార వ్యతిరేక ఓటింగ్ నమోదవుతున్నట్లు రాజకీయ నిపుణులు చెబుతున్నారు. తమిళనాడులో అధికార డీఎంకే, ప్రతిపక్ష అన్నాడీఎంకేతో పాటు విజయ్ టీవీకే పార్టీల మధ్య త్రిముఖ పోరు నెలకొంది. ఎండల్ని లెక్కచేయకుండా తమిళ ప్రజలు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# తన గూడు తానే నిర్మించుకునే కప్ప

మొదటి తరువాయి



ఇది ఈ ప్రాంతంలోని ఉభయచరాల వైవిధ్యాన్ని, పర్యావరణ ప్రాముఖ్యాన్ని తెలియజేస్తున్నది. గూడు కట్టుకొని దాంట్లో నివసించటమన్నది కప్పల్లో అరుదైన, సరికొత్త విషయంగా సైంటిస్టులు పేర్కొంటున్నారు.

### బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో

# భాజపాదే విజయం

మొదటి తరువాయి

షాక్ ఇచ్చిందని ప్రధాని మోడీ అన్నారు. టిఎంసి చొరబాటుదారులకు ఆశ్రయం కల్పించడం, మహా జంగల్ రాజ్ ను పోత్సహిస్తోందని మోడీ ఆరోపించారు. బెంగాల్ లో బిజెపి అధికారంలోకి వస్తే మతువా, నమశూద్ర వర్గాలకు ఆశ్రయం కల్పిస్తామని మోడీ కృష్ణానగర్లో జరిగిన ఎన్నికల ర్యాలీలో హామీనిచ్చారు.. ఈ ర్యాలీలో మోడీ ప్రసంగించారు. 'మీరు బిజెపి- ఎన్డిఎ విజయ పతాకాన్ని ఎగురవేయాలి. మే 4న బెంగాల్లో బిజెపి విజయోత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేస్తారు. ఝుల్మురిని కూడా అందజేస్తారు. ఝుల్మురి కొంతమందికి పిడుగులాంటి షాక్ ఇచ్చింది. నేను ఝుల్మురి తిన్నాను. కానీ ఆ ఝల్ (మసాలా) టిఎంసిని తాకింది' అని అన్నారు. బెంగాల్ ప్రజలు టిఎంసి పాలనను వ్యతిరేకిస్తున్నారు. 15 ఏళ్ల క్రితం కమ్యూనిస్టులను వ్యతిరేకించారు. ఇప్పుడు టిఎంసి జంగిల్ రాజ్ కి వ్యతిరేకంగా నిలబడ్డారు. దీనికి అణచివేతదారులు, అవినీతిపరులే జవాబుదారీగా ఉంటారు. మా మంత్రం సబ్కా సాథ్, సబ్కా వికాస్ అని మీకు తెలుసు. మే 4వ తేదీ తర్వాత పశ్చిమ బెంగాల్లో సుపరిపాలనకు కొత్త హామీ ప్రారంభం కానుందని అన్నారు. మతువా సమాజం, నమశ్రూద సమాజం, శరణార్థి కుటుంబాలు టిఎంసికి భయపడాల్సిన పనిలేదు. మీకు ఎవరు హానీ చేయలేరు. ఆశ్రయం, గౌరవం కోరుతూ భారతదేశానికి వచ్చిన వారందరికీ తాను అండగా నిలుస్తారని మోడీ హామీనిచ్చారు. బెంగాల్లో ఏర్పడే బిజెపి ప్రభుత్వం సిఎఎ కింద పౌరసత్వం మంజూరు చేసే పక్రియను వేగవంతం చేస్తోందని మోడీ అన్నారు. దేశంలోని ప్రతి భారత పౌరుడికి దక్కాల్సిన ప్రతి హక్కు, ప్రయోజనం మీకు లభిస్తుందని మోడీ హామీనిచ్చారు. నేడు బెంగాల్లో మొదటి దశ ఎన్నికలు జరుగుతున్నాయి. నేడు తమిళనాడులో కూడా జరుగుతున్నాయి. ఓటర్లందరికీ శుభాకాంక్షలు. ఈసారి ప్రతి ఒక్కరూ కొత్త ఓటింగ్ రికార్డులు సృష్టించాలని మోడీ ఓటర్లను కోరారు. బెంగాల్ లో గత 50 ఏళ్లలో హింసను కనిష్ట స్థాయికి పరిమితం చేసిన మొదటి ఎన్నిక ఇదే అని మోడీ చెప్పారు. లేకపోతే, ఇక్కడ ప్రతి వారం ఎవరో ఒకరిని ఉరితీయడం, దానిని ఆ తర్వాత ఆత్మహత్యగా చిత్రీకరించడం చేసేవారు. ఒకరకమైన గూండాల పాలన ప్రబలింది. ప్రజాస్వామ్య స్ఫూర్తిని మరోసారి నిలబెట్టినందుకు ఎన్నికల సంఘానికి తాను హృదయపూర్వక అభినందలు తెలిపారు.

# కాళేశ్వరంపై రెండో రోజూ సంబురాలు..

మొదటి తరువాయి



కొత్తపల్లి మండల కేంద్రంలో కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకొన్నారు. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండల కేంద్రంలోని డీ8 కెనాల్ వద్ద కాళేశ్వర జలాలతో కేసీఆర్ చిత్రపటానికి బీఆర్ఎస్ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు గూడూరి సురేశ్ అభిషేకం చేశారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేసీఆర్ చిత్రపటానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సంబురాలు నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో పటాకులు కాల్చారు.

# ప్రాథమిక పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

**హుస్నాబాద్ , ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చిగురుమామిడి మండలం ముల్కనూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవ కార్యక్రమం ప్రధానోపాధ్యాయురాలు బి. శారద ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ సాంబారి భారతమ్మ కొమురయ్య హాజరై విద్యార్థులకు ఎండాకాలంలో పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ రోజంతా తగినంత నీరు తాగడం, కొబ్బరి నీరు, పానకం, నిమ్మరసం వంటి సహజ పానీయాలు తీసుకోవడం, పెరుగు అన్నం, తరబూజ, మామిడి, దోసకాయ వంటి తేలికపాటి ఆహారం తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదని సూచించారు. మధ్యాహ్నం 11 గంటల నుండి 4 గంటల వరకు బయటకు వెళ్లడం తగ్గించాలని, బయటికి వెళ్తే టోపీ లేదా గొడుగు ఉపయోగించాలని, కాటన్ దుస్తులు ధరించాలని,






రోజుకు ఒకటి లేదా రెండు సార్లు స్నానం చేయడం ద్వారా శుభ్రత పాటించాలని సూచించారు. ఐస్‌క్రీమ్, కోల్డ్ డ్రింక్స్ వంటి జంక్ ఫుడ్‌ను తగ్గించి ఇంట్లో తయారు చేసిన ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని, సరైన విశ్రాంతి అవసరమని తెలిపారు. పై తరగతులకు వెళ్లే విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ పైడిపల్లి స్వర్ణలత, ఉపాధ్యాయులు భవాని, అనిత, రమ్య, మమత తదితరులు పాల్గొన్నారు. ఇదే సందర్భంలో ముల్కనూర్ అంగన్వాడి కేంద్రంలో దొబ్బల మావురవ్వ ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరిఫైయర్‌ను గ్రామ సర్పంచ్ సాంబారి భారతమ్మ కొమురయ్య ప్రారంభించారు. ఈ ప్యూరిఫైయర్ ద్వారా చిన్నారులకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రానుంది.

# ఫీజు రీయింబర్స్మెంట్ పథకం రద్దు కుట్రపై ఏబీవీపీ నిరసన

**హుస్నాబాద్, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పేద విద్యార్థుల ఉన్నత విద్యకు దోహదపడుతున్న ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎత్తివేయాలని కుట్ర పన్నుతోందని ఆరోపిస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) హుస్నాబాద్ శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం జరిగింది. సిద్దిపేట జిల్లా హాస్టల్ కన్వీనర్ చెన్నూరి రాజేష్ మాట్లాడుతూ, పేద మరియు బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా రద్దు చేయాలని చూస్తోందని విమర్శించారు. ప్రైవేట్ విద్యాసంస్థలు హైకోర్టును




ఆశ్రయించగా, ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడంతో విద్యార్థుల దగ్గర నుండి ఫీజులు వసూలు చేసుకోవచ్చని మధ్యంతర ఉత్తర్వులు వెలువడినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం సుమారు 14 లక్షల మంది విద్యార్థులు ఈ పథకం పై ఆధారపడి చదువుకుంటున్నారని, 10,000 కోట్ల రూపాయల బకాయిలు విడుదల చేయకపోవడమే కాకుండా ఇప్పుడు పథకాన్ని పూర్తిగా రద్దు చేయాలని ప్రభుత్వం చూస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజేష్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం తక్షణమే బకాయిలను విడుదల చేసి పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ సంయుక్త కార్యదర్శి అంజి, కార్యకర్తలు అభిరామ్, రాకేష్, సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉధృతంగా మారిన ఆర్టీసీ కార్మికుల సమ్మె

**కరీంనగర్/హుస్నాబాద్, ఏప్రిల్ 23(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మె రెండో రోజుకు చేరి మరింత ఉధృతమైంది. తమ న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం బుధవారం నుండి ప్రారంభమైన ఈ సమ్మెకు బీజేపీ పూర్తి మద్దతు ప్రకటించింది. కరీంనగర్ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు గురువారం సమ్మె శిబిరాన్ని సందర్శించి కార్మికులతో సంఘీభావం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన కోరికలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, టెంట్ వేసుకోవడానికి కూడా అనుమతి నిరాకరించడం యాజమాన్యం మొండితనానికి నిదర్శనమని విమర్శించారు. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు బీజేపీ, కేంద్ర నాయకత్వం కార్మికుల వెంటే ఉంటుందని భరోసా ఇచ్చారు. కరీంనగర్ బస్టాండ్ వద్ద కార్మికులు చేపట్టిన ధర్నా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. నిరసనకారులను అడ్డుకోవడానికి పోలీసులు ప్రయత్నించడంతో వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. పలువురు నేతలు,



కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం మొండివైఖరి వీడి వెంటనే చర్చలు జరపాలని, సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు. హుస్నాబాద్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక స్టేట్ జనరల్ సెక్రటరీ బుర్ర శ్రీనివాస్ గౌడ్ కార్మికులకు మద్దతు ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా రవాణా స్తంభించి సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపు లేదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి పేస్కేల్ అమలు చేయాలని, మిగతా డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో కౌన్సిలర్లు, జేఏసీ నాయకులు, మహిళా కార్మికులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సమ్మె మరింత ఉధృతం అవుతుందని కార్మిక సంఘాలు హెచ్చరించాయి.

## ఆర్టీసీ సమ్మెకు సిపిఐ మద్దతు

**కల్వకుర్తి, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో పోరాటాలను ఉధృతం చేస్తామని సిపిఐ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి పులిజాల పరశురాములు




హెచ్చరించారు. కల్వకుర్తి పట్టణంలో గురువారం ఆయన మాట్లాడుతూ, "ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి. షెడ్యూల్డ్ యూనియన్లపై ఆంక్షలు తొలగించి గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలి. ఆగిపోయిన రెండు వేతన సవరణలను అమలు చేసి, ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త బస్సులను కొనుగోలు చేయాలి" అని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మెకు సిపిఐ తాలూకా సమితి సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు ఆయన తెలిపారు.

## క్రికెట్ క్రీడాకారులకు టీషర్ట్ల అందజేత



**ఎలిగేడు, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** యువత క్రీడల్లో రాణించడంతోపాటు క్రమశిక్షణతో ఉండేలా ప్రోత్సహించేందుకు గురువారం ఎలిగేడు క్రికెట్ క్రీడాకారులకు జీ స్కిల్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో టీషర్టు అందజేశారు. సర్పంచ్ కప్పల ప్రవీణ్ చేతులమీదుగా టీషర్టను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ ముంజంపల్లి రమేశ్, బాసంపల్లి వినోద్, అడ్డగుంట తిరుపతి గౌడ్, బోయిని సతీష్, న్యాతరి పోచాలు తదితరులు పాల్గొన్నారు.

# రానున్నది బహుజన రాజ్యమే

- కొలిపాక శ్రీనివాస్



**పెద్దపల్లి, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పెద్దపల్లిలో రానున్నది బహుజన రాజ్యమేనని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా కన్వీనర్ కొలిపాక శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మహ్మద్ మెహరాజ్‌ను పార్టీ కండువా కప్పి ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరూ ఏకమై బహుజన రాజ్యాధికార దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బహుజన ఆశీర్వాదంతో పెద్దపల్లి ఎమ్మెల్యేగా బరిలో ఉంటానని, ప్రజలు దీవించి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మహ్మద్ మెహరాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని, అందుకే బహుజన రాజ్యం కోసం ఫార్వర్డ్ పార్టీలో చేరానని తెలిపారు. బహుజన బిడ్డను ఎమ్మెల్యేగా చేసే వరకు పోరాటం ఆగదని ఆయన అన్నారు. కార్యక్రమంలో కుక్క శ్రావణ్ కుమార్, గులాం ఖాజా పాషా, కుక్క కనకరాజు, బొంకూరి నరేందర్, కుక్క అశోక్, ఇరుగురాల రాజు, కుక్క శ్రీనాథ్, వడ్డేపల్లి తిరుమల్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ హనుమాన్ హిందూ సమ్మేళనం

**గన్నేరువరం, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో శ్రీ హనుమాన్ హిందూ సమ్మేళనం ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా జరిగింది. కార్యక్రమానికి మండలంలోని వివిధ హిందూ సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో భక్తులు, యువత హాజరై ప్రత్యేక శోభను తీసుకువచ్చారు. సభ భక్తి, ఆధ్యాత్మికత, ఐక్యత సందేశాలతో నిండుగా సాగింది. ప్రారంభంలో




హనుమాన్ స్వామి ఆశీర్వాదాలతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సమ్మేళనం ద్వారా హిందూ సంఘాల మధ్య ఐక్యతను బలపరచడం, భక్తి భావనను పెంపొందించడం లక్ష్యంగా నిర్వహించారని నిర్వాహకులు తెలిపారు.

# ఘనంగా మున్సిపల్ కార్మికుల రజతోత్సవ సంబరాలు



**కరీంనగర్, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ నగరంలో మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రజతోత్సవ వేడుకలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. సంఘం ఏర్పడి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గీతా భవన్ చౌరస్తా నుండి కళాభారతి వరకు కార్మికులు భారీ ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ పొడవునా కార్మికులు ఆడుతూ పాడుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర స్థాయి నాయకులు ప్రసంగించి, కార్మికుల హక్కుల రక్షణ కోసం యూనియన్ చేసిన పోరాటాలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో మున్సిపల్ కార్మికులు, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ సమ్మెకు సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**కుషాయిగూడ, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కుషాయిగూడ డిపోలో గురువారం జరిగిన ఆర్టీసీ కార్మికుల సమ్మెకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సంఘీభావం



తెలిపారు. ఆయన మాట్లాడుతూ, "కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలి. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలి. లేనిపక్షంలో సకలజనుల సమ్మెకు దిగుతాం" అని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు, టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో చేతిపంపు బోరింగ్‌లు



**కరీంనగర్, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పట్టణంలోని పలు డివిజన్లలో చేతిపంపు బోరింగ్‌లు మరమ్మతులకు నోచుకోక నిరుపయోగంగా మారి కాలగర్భంలో కలిసిపోతున్నాయి. వేసవి కాలం కావడంతో ప్రజలు మంచినీటి అవసరాల కోసం ఇబ్బందులు పడుతున్నారు.మధ్యతరగతి అద్దె ఇళ్లలో నివసించే ప్రజలు దినం తప్పించి దినం నీటి సమస్యను ఎదుర్కొంటూ చేతిపంపులను వినియోగించుకోవాలని కోరుకుంటున్నారు. అయితే, గత కొంతకాలంగా బోరింగ్‌లు పనిచేయక శిథిలావస్థకు చేరాయి.ప్రజల కనీస నీటి అవసరాలను గుర్తించి సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకుని చేతిపంపు బోరింగ్‌లను మరమ్మతు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## సనాతన ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత

- సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**ఆమనగల్లు, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
సనాతన ధర్మ పరిరక్షణతో పాటు సంస్కృతి అభివృద్ధికి హిందువులు పాటుపడాలని టాస్క్ సీఓఓ, ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ అన్నారు. పట్టణ కేంద్రంలోని సద్గురు శ్రీ నిత్యశుద్ధానంద స్వామి క్షేత్రము, శ్రీరామదూత ఆశ్రమములో ఆశ్రమ స్థాపకులు శ్రీశ్రీ శివానంద స్వామి వారు తురీయాశ్రమ సన్యాస దీక్షా స్వీకరించిన మేరకు గురువారం స్వామిజీని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సనాతన ధర్మ కేవలం మతం మాత్రమే కాదని, ఇది ఒక జీవనశైలి, ప్రకృతి, సమాజం, వ్యక్తి మధ్య సమతుల్యతను ప్రోత్సహిస్తుందన్నారు. సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు ప్రతాప్ రెడ్డి, రూపం వెంకట్ రెడ్డి, మరియు స్వామీజీలు, భక్తులు, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వాసవి మాత జయంతిని అధికారికంగా ప్రకటించడం హర్షనీయం..

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అశోక్ గుప్తా



**ఆమనగల్లు, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీ వాసవి మాత జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడం ఎంతో హర్షనీయమైన విషయమని తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పొద్దుటూరి అశోక్ గుప్తా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏర్పాటు చేశారని అదేవిధంగా శ్రీ వాసవి మాత జయంతిని ప్రభుత్వ లాంఛనాల ప్రకారం అమ్మవారి జయంతిని నిర్వహించేందుకు అధికారిక ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాష్ట్ర ఆర్యవైశ్యుల తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ఆర్యవైశ్యులంతా ఎల్లప్పుడూ కాంగ్రెస్ వైపే ఉన్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైశ్యులకు ఎన్నో సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు.

## రోడ్డు విస్తరణ పనుల ప్రారంభం



**కల్వకుర్తి, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ గురువారం రూ.3 కోట్లతో చేపట్టిన రోడ్ విస్తరణ, కాలువ, డివైడర్ పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, “ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో కల్వకుర్తి పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తాం” అని అన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రతినిధి చీమ్ముల శ్రీకాంత్ రెడ్డి, వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక వాయిదా


- హాజరు కాని కౌన్సిలర్లు...




**ఆమనగల్లు, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆమనగల్లు మున్సిపాలిటీలో కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక అనూహ్యంగా వాయిదా పడింది. గురువారం ఎన్నిక నిర్వహించనున్నట్లు ముందుగానే మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ ప్రకటించగా, ఈ మేరకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సాధారణ సమావేశం అనంతరం ఎన్నిక ప్రక్రియ చేపడతామని అధికారులు స్పష్టం చేశారు.అయితే నిర్ణయించిన సమయానికి కీలక ప్రజాప్రతినిధులు గైర్హాజరు కావడం సమావేశాన్ని అర్థాంతరంగా నిలిపివేసింది. మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు చెందిన ఏడుగురు కౌన్సిలర్లు ఉన్నప్పటికీ, చైర్మన్ పత్యనాయక్, వైస్ చైర్‌పర్సన్ తల్లోజు గీత ఆచారి, అలాగే బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన కౌన్సిలర్లు ఎవరూ హాజరు కాలేదు.ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సమావేశానికి కమిషనర్, అధికారులు హాజరై, సభ్యుల రాక కోసం దాదాపు 35 నిమిషాల పాటు వేచిచూశారు. అయినప్పటికీ, ఎవరూ హాజరు కాకపోవడంతో ఎన్నిక ప్రక్రియను కొనసాగించడం సాధ్యం కాకపోయింది.ఈ పరిస్థితుల్లో కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ ప్రకటించారు. తదుపరి సమావేశానికి సంబంధించిన తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.మున్సిపల్ పాలనలో కీలకమైన ఈ ఎన్నిక వాయిదా పడటం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సమావేశానికి హాజరు కాని ప్రజాప్రతినిధులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# భాషా సాహిత్య సేవకులు -విజయ ప్రసాద్ గారు

నాకు అత్యంత సన్నిహితులు, స్నేహితులు, తెలుగు భాషోపాధ్యాయులు మరియు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ కవి పురస్కార గ్రహీత శ్రీ నలుమాసు విజయ ప్రసాద్ గారు అనునిత్యం సాహిత్య పిపాసులై తెలుగు భాషా సేవలో తరిస్తున్నారు. వీరు ప్రతిరోజు ఒక పద్యం చొప్పున సహస్ర పద్యరచన మైలురాయిని అధిగమించి ఇప్పటివరకు 1600 పద్యములను సమర్పించారు. ఇందులోని కొన్ని ఆణిముత్యములను శతక పుస్తకముగా వెలువరించడం ముదావహం. సమాజంలోని అనేక అంశాలను సృజిస్తూ సామాజిక స్పృహ కలిగించే రీతిలో పద్య రచన గావించారు. తెలుగు ఉపాధ్యాయులుగా ఉంటూ చిన్నారులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే క్రమంలో మరియు సమాజం యొక్క తీరుతెన్నులను గమనిస్తూ తన మదిలో మెదిలిన భావాలను మన ముందు ఆవిష్కరించారు. బాధ్యతాయుత సమాజానికి ప్రేరణ,దిక్సూచిగా కవుల రచనలు కొనసాగడం ద్వారా సమాజం రూపకల్పనలో సత్ఫలితాలు ఆశించవచ్చని వారు అభిలాషించారని చెప్పవచ్చు. తన రచనలలో శాంతి,స్నేహము సౌభ్రాతృత్వము,దేశభక్తి




మొదలగు అంశాల ప్రస్తావనలతో పాటు సమాజంలోని అనుచిత పోకడలను కూడా వేలెత్తి చూపారు. అంతేకాకుండా తెలుగు భాషాసేవ తపన మెండుగా ఉండడం వలన “తేనియలు” అనే నూతన ప్రక్రియ రూపకర్తగా విజయ ప్రసాద్ గారు ఎందరో వర్తమాన కవులకు రచన పట్ల ఆసక్తి పెంచుతున్నారు. గతంలో వీరి ఆధ్వర్యంలో వెలువరించిన “అక్షర తేనియలు” పుస్తక సంకలనంలో నేను కూడా ఈ ప్రక్రియలో రచన చేశాను.

విజయ ప్రసాద్ గారి కలము నుండి సమాజ శ్రేయస్సు కోరే భావనలు ఇలాగే జాలువారి సమాజంలో నిత్య చైతన్య శక్తిని నిలపాలని ఆకాంక్షిస్తున్నాను.

**మీ శ్రేయోభిలాషి..**

గుగ్గిళ్ళ నాగభూషణ చారి.
MA.B.Ed.
గ్రా.. చెప్యాల
మం.. కొడిమ్యాల
జిల్లా.. జగిత్యాల



## శ్రీ వాసవీ మాత జయంతి రాష్ట్ర పండుగగా ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం

- హర్షం వ్యక్తం చేసిన ఏసీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బురుగు నాగరాజు గుప్త



**మర్రిగూడ, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం, అహింసా మూర్తి శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా రాష్ట్ర పండుగగా ప్రకటించింది.ఈ సందర్భంగా ఏసీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బురుగు నాగరాజు గుప్త మాట్లాడుతూ, “ప్రతి సంవత్సరం వైశాఖ శుక్ల పక్ష దశమి నాడు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలు నిర్వహించబడతాయి. ఈ ఏడాది ఏప్రిల్ 26న రాష్ట్ర పండుగగా ఘనంగా జరగనున్నాయి. అన్ని జిల్లాల కలెక్టర్లు అధికారికంగా వేడుకలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది” అని తెలిపారు.శ్రీ వాసవీ మాత జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించినందుకు తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆర్యవైశ్యుల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## వాసవి మాత జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించడం పట్ల సతీష్ బాబు హర్షం



**ఎలిగేడు, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆర్యవైశ్యుల కులదైవం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం పట్ల ఆర్యవైశ్యులు హర్షం వ్యక్తం చేశారు.ఎలిగేడు మండల ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి తాటి పెల్లి సతీష్ బాబు మాట్లాడుతూ, “ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు తరువాత, ఈ నెల 26న జరగనున్న వాసవి మాత జయంతి ఉత్సవాలను ఇకపై ప్రభుత్వం రాష్ట్ర పండుగగా నిర్వహించడం ప్రతి ఆర్యవైశ్యుడికి గర్వకారణం” అని అన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణారావులకు ఆర్యవైశ్యుల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## పట్టణాన్ని ఆదర్శంగా మార్చుదాం

- చైర్మన్ పత్యనాయక్



**ఆమనగల్లు, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రజల సహకారంతో పార్టీలకతీతంగా అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతూ ఆమనగల్లు రూపురేఖలు మార్చుదామని మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్ తెలిపారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో 1 కోటి 50 లక్షలతో అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, వార్డు కౌన్సిలర్ ఎర్రవోలు మహేష్ లతో కలిసి చైర్మెన్ పత్యనాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దడం కోసం వార్డుల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాలువలు, వీధి దీపాలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. మున్సిపాలిటీలో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలతో పట్టణం మరింత సుందరంగా మారిందన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కండె హరిప్రసాద్, కౌన్సిలర్లు మొక్తల వెంకటయ్య, నిరంజన్, సునీత ప్రశాంత్ నాయకులు గుర్రం కేశవులు, గోరటి నర్సింహా, కృష్ణ నాయక్, అబ్దుల్ ఖాదర్, కండె భాస్కర్, గంగా రవి, వరకుప్పల శ్రీనివాస్, అబ్దుల్ కరీం, గోలీ శ్రీనివాస్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాలను సందర్శించిన న్యాయవాదులు

- ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకార్ యాదిలాల్



**ఆమనగల్లు, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మానసిక ప్రశాంతత కోసం ప్రజలంతా భక్తి భావాన్ని అలవర్చుకోవాలని ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకార్ యాదిలాల్ అన్నారు. ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఈ సంవత్సరం రెండవసారి ఎన్నికైన సందర్భంగా న్యాయవాదులతో కలిసి తిరుపతి, శ్రీకాళహస్తి పుణ్యక్షేత్ర దేవాలయాలను సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయవాదులు నిత్యం తమ కక్షిదారుల కోసం కోర్టు పనుల్లో నిమగ్నమవుతూ పని ఒత్తిడికి గురవుతు కూడా పనిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మానసిక ఒత్తిడికి గురి కాకుండా వ్యాయామాలతో పాటు దైవభక్తిని అలవర్చుకొని ముందుకు సాగాలని ఆయన తెలిపారు. దైవదర్శనాలతో మానసిక ఒత్తిడి దూరమవుతుందని ఆయన తెలిపారు. ఆయన వెంట న్యాయవాదులు ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ గౌడ్, గ్రంథాలయ కార్యదర్శి గణేష్ గౌడ్, క్రీడా కార్యదర్శి సంతోష్ కుమార్, కార్యవర్గ సభ్యులు దేవేందర్ గౌడ్, సర్దార్ నాయక్, న్యాయవాదులు జగన్ గౌడ్, బిక్యనాయక్, ఆంజనేయులు గౌడ్, దేరంగుల శేఖర్, టి రమేష్, శ్రీనివాస్, ప్రభు నాయక్, మహేశ్వర్, శ్రీశైలం, శివశంకర్, నరేందర్ తదితరులున్నారు.

# టీచర్ల పైరవీ డిప్యూటేషన్లను రద్దు చేయాలి: టీపీటీఎఫ్

**హైదరాబాద్, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
2025--26 విద్యా సంవత్సరం ప్రారంభంలో సుమారు 200 మందికి పైగా ఉపాధ్యాయులు పైరవీలతో పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వుల ద్వారా డిప్యూటేషన్ బదిలీలు పొంది హైదరాబాద్ మరియు పరిసర జిల్లాల్లో పనిచేస్తున్నారు.విద్యా సంవత్సరం చివరి పనిదినాన అన్ని రకాల డిప్యూటేషన్లను రద్దు చేసి, ఉపాధ్యాయులను తమ తమ పాఠశాలల్లోకి పంపకుండా, డిప్యూటేషన్ పాఠశాలల్లోనే కొనసాగేటట్లు ఇచ్చిన ఉత్తర్వులను టీపీటీఎఫ్ తీవ్రంగా ఖండించింది.
రాష్ట్ర అధ్యక్షుడు చకినాల అనిల్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి మాట్లాడుతూ, "జిల్లాలలో ఉపాధ్యాయుల సర్దుబాటు ద్వారా ఇతర పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లను, పైరవీలతో హైదరాబాద్ పరిసరాల్లో పనిచేస్తున్న టీచర్ల డిప్యూటేషన్లను వెంటనే రద్దు చేసి, తమ తమ పాఠశాలల్లో చేరేలా ఉత్తర్వులు ఇవ్వాలి" అని డిమాండ్ చేశారు.అదేవిధంగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ బడిబాట కార్యక్రమంలో భాగంగా టీచర్లు తమ సొంత పాఠశాలల్లో పనిచేస్తేనే విద్యార్థుల నమోదు పెరుగుతుందని, విద్యాశాఖ అధికారులు అన్నిరకాల డిప్యూటేషన్ల రద్దుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఎండల దృష్ట్యా ఉపాధి కూలీలు సమయ వేళలు పాటించాలి

- ఎంపీడీవో మున్నయ్య



**మర్రిగూడ, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఉపాధి హామీ కూలీలు సమయ వేళలు పాటించాలని మర్రిగూడ ఎంపీడీవో మున్నయ్య సూచించారు.గురువారం మండలంలోని వట్టిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బట్లపల్లి తెల్లపలుగు గుట్ట సమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. కూలీలతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వం రోజుకు 307 కూలి కల్పించిందని, కూలీలు పూర్తి వేతనం పొందేలా పనులు చేసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కూలీలకు సూచించారు.ఎండల తీవ్రత దృష్ట్యా కూలీల దాహార్తిని తీర్చేందుకు వట్టిపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సర్పంచ్ శిరసవాడ బిక్షం తాగునీటి సదుపాయం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ జింకల బిక్షం, మేటిలు పాల్గొన్నారు.

## గ్రామాల్లో హిందూ సమ్మేళనం కరపత్రాల పంపిణీ



**ఎలిగేడు, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఈనెల 26న ఎలిగేడు మండల కేంద్రంలో జరగనున్న హిందూ సమ్మేళనంకు ఆహ్వానిస్తూ గురువారం ధూళికట్ట, నర్సాపూర్ తదితర గ్రామాల్లో కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు.హిందువుల ఐక్యతను చాటేందుకు నిర్వహిస్తున్న ఈ సమ్మేళనంలో ప్రతి హిందూ సోదరులు, సోదరీమణులు పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువకులు, హిందూ సోదరులు పాల్గొన్నారు.


# రాకల్ దేవ్ పల్లిలో పోషణ్ పక్వాడ



ఎలిగేడు అంగన్వాడి మూడవ సెంటర్లో గ్రాడ్యుయేషన్ డే నిర్వహణ



చిన్నారులకు అన్నప్రాసన నిర్వహిస్తున్న స్థానిక సర్పంచ్ కప్పల ప్రవీణ్



ఆకట్టుకున్న పోషణ్ పక్వాడ ఆకృతి



రేకల్దేవ్ పల్లి అంగన్వాడి సెంటర్ లో మాట్లాడుతున్న సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్

**ఎలిగేడు, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండల కేంద్రంలోని అంగన్వాడీ మూడవ సెంటర్‌తో పాటు రాకల్ దేవ్ పల్లిలో గురువారం పోషణ్ పక్వాడ (ఈసీసీఈ డే) కార్యక్రమం జరిగింది.చిన్నారుల కోసం అన్నప్రాసన, గ్రాడ్యుయేషన్ డే, బాల మేళా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు కప్పల ప్రవీణ్, మద్దెల రమాదేవి సంపత్ మాట్లాడుతూ, "గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు అంగన్వాడీ సెంటర్లలో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అని సూచించారు.తరువాత ఐసీడీఎస్ సూపర్వైజర్ సూర్యకళ అంగన్వాడీ సేవల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి, పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అంజలి, అశోక్, వార్డు సభ్యురాలు సృజన, అంగన్వాడీ టీచర్లు సరోజ, జ్యోతి, సరస్వతి, ఓదేశ్వరి, ఆశా వర్కర్ సరోజన, ఆయాలు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

# వి.బి.జి.రాంజీ. స్కీంను ఉపసంహరించుకోవాలి

-వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్



**నిడమానూరు ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
కేంద్రంలో బిజెపి ప్రభుత్వం నరేంద్ర మోడీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, కార్పొరేట్ శక్తులకు అనుకూలమైనటువంటి నిర్ణయాలు చేయడం గ్రామీణ పేదలను మరింత పేదలుగా చేసేటటువంటి నిర్ణయాలు చేయడం లో భాగంగానే ఇటీవల పార్లమెంటులో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని పేరు మార్చి వి బి జి రంజీ స్కీన్ ను తీసుకొచ్చిందని వెంటనే దానినిఉపసంహరించుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షులు కొండేటి శ్రీను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి కోటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఉపాధి హామీ కూలీలతో కలిసి ఎంపీడీవో ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి అనంతరం వారు మాట్లాడారు. ప్రతి ఏటా ఉపాధి హామీకి రెండున్నర లక్షల కోట్లు అవసరం ఉండగా 63 వేల కోట్లు మాత్రమే కేటాయించారని, నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చినప్పటికీ నుండి క్రమంగా బడ్జెట్లో నిధులు తగ్గించి చట్టాన్ని నేరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని వారన్నారు. ప్రస్తుతం వ్యవసాయంలో యాంత్రికరణ ఆధునికరణ పెరిగిన కారణంగా గ్రామీణ పేదలు కూలీలు పని దొరకక బస్సులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వారన్నారు. సంవత్సరానికి 200 రోజులు పని కల్పించి 800 రూపాయలు కూలి తగ్గకుండా ఇవ్వాలని, పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించి చేసిన పనికి వారం వారం పే స్లిప్పులు ఇవ్వాలని,పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలపై భారాలు పెట్టకుండా 100% కేంద్రమే నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈకేవైసి ద్వారా రెండు పూటలా ఫోటో తీసే విధానం తో వ్యవసాయ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని, దానిని రద్దు చేయాలని వారు కోరారు. గ్రామీణ పేదలకు జీవనాధారమైన ఉపాధ్యాయుని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఉపాదాన్ని సిబ్బందిని పర్మినెంట్ చేసి వేతనాలు పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు భూమిలేని పేదలకు వ్యవసాయ కార్మికులకు ఏటా 12000 రూపాయలు ఇస్తానన్న హామీని నిలబెట్టుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కోమండ్ల గురువయ్య ఉపాధి హామీ కూలీలు దుర్గయ్య, శంకరయ్య,చినరాములు, వెంకయ్య,నాగమణి, ధనమ్మ, యశోద, మణెమ్మ, కాశమ్మ,రాజు,యశోద,సునీత, పద్మ, పావని, మంగమ్మ, శైలజ, అంతమ్మ,సత్యవతి, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలి



**దేవరకొండ ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ మండలం గొట్టిముక్కల గ్రామం లో పోషణ పక్షంలో భాగంగా,
అంగన్వాడీ కేంద్రశీ నందు పోషణ పక్షం ప్రోగ్రాం నిర్వహించారు. సూపర్వైజర్ డి చిట్టెమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పకుండా పోషక విలువలు కలిగినటువంటి ఆహార పదార్థాలు ప్రతినిత్యం తీసుకోవాలి అని వివరించారు, ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు మరియు పిల్లలు సిరి , మరియు చిరు ధాన్యాలతో పాటుగా మన పరిసరాలలో దొరికే కాయగూరలు, ఆకుకూరలు, పండ్లు తప్పకుండా తీసుకోవాలి అని తెలియజేయడం జరిగింది. అలాగే వేయి రోజుల ప్రాముఖ్యత గురించి,మూడు నుంచి ఆరు సంవత్సరాల వయసులో పిల్లల మెదడు 90 శాతం అభివృద్ధి జరుగుతుంది కాబట్టి ఈ వయసులో పిల్లలకు ఎక్కువ అవకాశాలు కల్పించాలి అప్పుడే వారి అభివృద్ధి కుంటూ పడకుండా ఉంటుందని తెలియజేయడం జరిగింది. అలాగే డిసిపియు యూనిట్ మెంబర్ అంజలి బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి, బాల్యవివాహాలు చేయడం ద్వారా తల్లిదండ్రులకు మరియు ప్రోత్సహించే అటువంటి వారికి ఎలాంటి శిక్షలు పడతాయి అని వివరించడం, తల్లిదండ్రులు లేని అనాథ బాలలకు మిషన్ వాత్సల్య పథకంపై అవగాహన కలిపించడం అక్రమంగా పిల్లలను దత్తత తీసుకోవడం ఇవ్వడం చట్టరీత్య నేరం అన్ని తెలిపరిచారు, గ్రామ సర్పంచ్ ఎరుకలి పార్వతీ వెంకటేష్ గారు మాట్లాడుతూ ఆరు సంవత్సరాల లోపు పిల్లలందరినీ అంగన్వాడికి పంపించాలని గర్భిణీ బాలింతలు ప్రతిరోజు అంగన్వాడీ కేంద్రానికి వచ్చి భోజనం చేయాలని అంగన్వాడి కేంద్రాల్లో ఇచ్చే బాలామృతం, బాలామృతం ప్లేసు,ఎగ్స్ అర్హులు అయినావాళ్లు వినియోగించుకోవాలని గవర్నమెంట్ నుంచి వచ్చే బెనిఫిట్స్ తప్పకుండా
వినియోగించుకోవాలి అలాగే ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో ఎమ్ ఎల్ హెచ్ పి అనిత ,ఉపసర్పంచ్ మాచెర్ల వెంకటయ్య, యూత్ కాంగ్రెస్ దేవరకొండ మండల అధ్యక్షుడు ముకురోజు రాజు, అంగన్వాడి టీచర్లు పద్మ , అలివేలు, వనిత,చిట్టి, ఆశా కార్యకర్త , తల్లులు పాల్గొన్నారు.

## ఎక్స్ ప్లోర్ యూనిస్టడీ అబ్రాడ్ కన్సల్టెంట్ కార్యాలయం ప్రారంభం

ముఖ్య అతిథిగా పాల్గొన్న షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ మరియు వైస్ చైర్మన్



**రంగారెడ్డి జిల్లా ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
షాద్ నగర్ పట్టణం లో విజయ్ నగర్ కాలనీ రోడ్డులో ఎక్స్ ప్లోర్ యూనిస్టడీ అబ్రాడ్ కన్సల్టెంట్ ఆఫీసును ప్రారంభించిన షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ , వైస్ ఛైర్మన్ అందే మోహన్ ముదిరాజ్ ప్రారంభించారు, ఈ సందర్భంగా చైర్మన్ వైస్ చైర్మన్ నిర్వాహకులు సన్మానించారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పెంటయ్య మాజీ కౌన్సిలర్ విజయకుమార్ రెడ్డి, తదితరులు పాల్గొనారు.

# పోలీస్ పహారా మధ్య బస్సులు తిరగడంతో ఆర్టీసీ కార్మికుల ఆగ్రహం

**అమరాబాద్, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మె రెండో రోజుకు చేరుకోవడంతో అచ్చంపేటలో ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టారు. అచ్చంపేట డిపో మేనేజర్ పి.ఎం.డి. ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం నాలుగు గంటల నుంచే అద్దె బస్సులను రంగంలోకి దింపడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. సమ్మె కారణంగా 58 ప్రభుత్వ బస్సుల్లో ఒక్కటి మాత్రమే నడపగా, 27 అద్దె బస్సులను నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, హైదరాబాద్, మద్దిమడుగు మార్గాల్లో నడిపించారు. ప్రజా రవాణా సుమారు 62 శాతం తగ్గినా, గురువారం ఒక్కరోజే 4--5 వేల మంది ప్రయాణికులు బస్సులను వినియోగించారు. డివిజన్ పల్లె శ్రీనివాస్ ముందస్తు హెచ్చరికలతో కార్మికులు శాంతియుతంగా నిరసన కొనసాగించారు. బుధవారం రాత్రి దీక్ష




టెంట్లను తొలగించడంతో పాటు గురువారం తలపెట్టిన వంట వార్పు కార్యక్రమాన్ని రద్దు చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తూ, ప్రభుత్వం మొండితనం వీడకపోతే నిరసన మరింత ఉధృతం అవుతుందని హెచ్చరించారు.

# ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నంపై బీజేపీ తీవ్ర విమర్శలు



**హుస్నాబాద్, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికుల సమస్యలను పట్టించుకోకపోవడంతో నర్సంపేటలో ఒక డ్రైవర్ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసిన ఘటనపై బీజేపీ నాయకులు తీవ్రంగా స్పందించారు. ఎల్కతుర్తి మండల బీజేపీ అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ, ఈ ఘటనకు పూర్తి బాధ్యత రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కార్మికులను నిర్లక్ష్యం చేయడం వల్లే ఇటువంటి పరిస్థితులు ఏర్పడ్డాయని ఆయన విమర్శించారు. కార్మిక సంఘాలు నిరసనలు చేస్తున్నప్పటికీ చర్చలకు పిలవకపోవడం పాలనా వైఫల్యమని పేర్కొన్నారు. తీవ్రంగా గాయపడిన డ్రైవర్‌కు మెరుగైన వైద్యం అందించి, ఖర్చులను ప్రభుత్వం భరించాలని, పెండింగ్ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని బీజేపీ డిమాండ్ చేసింది. ప్రభుత్వం మొండితనం వీడకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని, అవసరమైతే బీజేపీ ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు చేపడతామని హెచ్చరించారు.

# ఘనంగా కాంగ్రెస్ నేత కిచ్చన్న పుట్టినరోజు వేడుకలు




**మహేశ్వరం, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న పుట్టినరోజు సందర్భంగా 58వ డివిజన్ ప్రశాంతి హిల్స్‌లోని లెనిన్ నగర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంద్రమ్మ కమిటీ కోఆర్డినేటర్ ధారావత్ స్వామి నాయక్, మాజీ కోఆప్షన్ సభ్యుడు జటావత్ రవి నాయక్, బాలపూర్ మండల ఉపాధ్యక్షుడు వరికుప్పల శివ, ఇంద్రమ్మ కమిటీ సభ్యులు ఆలేటి నాని, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ మాదారి శ్రీనివాస్, అందోజు లక్ష్మాచారి, సీనియర్ నాయకులు మోటమ్ యాదయ్య, సునీల్ కుమార్, అజయ్, విజయ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు. నాయకులు కిచ్చన్నకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# డంపింగ్ యార్డ్ వల్ల ప్రజాలు తీవ్ర సమస్యలు ఎదురుకుంటున్నారని బీజేపీ ఆగ్రహం



**హుజురాబాద్, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** హుజురాబాద్ రూరల్ మండలం సిర్సపల్లి శివారులో నాలుగు జిల్లాల చెత్తను డంపింగ్ చేయడానికి యార్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ నిర్ణయం స్థానిక ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. దాదాపు 125 ఎకరాల్లో డంపింగ్ యార్డ్ ఏర్పాటుతో ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి తీవ్ర ప్రమాదం వాటిల్లుతుందని బీజేపీ ఎమ్మెల్సీ అంజి రెడ్డి తీవ్రంగా విమర్శించారు. గురువారం ఆయన జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణరెడ్డి, స్థానిక బీజేపీ నేతలతో కలిసి స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం సమస్యలను సృష్టించడం సరికాదని, నాలుగు జిల్లాల చెత్తను ఒకే ప్రాంతంలో వేయడం వల్ల రైతులు, గ్రామస్తుల జీవనోపాధి దెబ్బతింటుందని అన్నారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిర్ణయంతో హుజురాబాద్ ప్రాంతంలో నెల రోజులుగా గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని, ప్రజలు నిరసనలు, రిలే నిరాహార దీక్షలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం మొండి వైఖరి కొనసాగిస్తోందని ఆయన విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు మేలు చేయకపోయినా పర్వాలేదు కానీ హాని కలిగించే కార్యక్రమాలు చేపట్టకూడదని అంజి రెడ్డి స్పష్టం చేశారు.

# వాసవి మాత జయంతికి రాష్ట్ర పండుగ హోదా



**కరీంనగర్, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఆర్యవైశ్యుల చిరకాల వాంఛను నెరవేర్చుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వాసవి మాత జయంతికి రాష్ట్ర పండుగ హోదా కల్పించింది. ఏటా వైశాఖ శుక్ల పక్ష దశమి రోజున అధికారికంగా వేడుకలు జరపాలని జీవో విడుదల చేయడంతో వైశ్య సోదరులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్ టవర్ సర్కిల్ వద్ద కాంగ్రెస్ నాయకులు సిరిపురం మనోజ్ కుమార్, కంకణాల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో వాసవి కన్యకా పరమేశ్వరి మాత, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. వ్యాపారులకు మిఠాయిలు పంచి సంబరాలు జరిపారు. నాయకులు మాట్లాడుతూ అన్ని కులాల, మతాల పండుగలను గౌరవించడం కాంగ్రెస్ పార్టీ విధానం అని, వాసవి మాత ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు . ఈ కార్యక్రమంలో వైద్యుల అంజన్ కుమార్, కన్న కృష్ణ, కటకం వెంకట రమణ, నార్ల కార్తీక్, ముక్క భాస్కర్, ఎలగందుల మునీందర్, పోకల లక్ష్మీనారాయణ, చందా లక్ష్మీనారాయణ, పైడా రవి, దేవి శెట్టి రమేష్, మడుపు మోహన్, కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, సరిళ్ళ ప్రసాద్, బడిశెట్టి భూమయ్య, చిట్టిమల్ల శ్రీనివాస్, వైశ్య సంఘం సభ్యులు, తాటి పెల్లి సతీష్ బాబు, అక్కినపల్లి నాగరాజు, ఏవీఎం మధు, భూపతి శ్రీనివాస్, బొల్లం సంతోష్, గజ్జల వెంకటేష్, అందే శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# దేవరకొండ ప్రాంతీయ ఆసుపత్రిలో 'కాయకల్ప' బృందం తనిఖీ






**దేవరకొండ ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** దేవరకొండ ప్రాంతీయ ఆసుపత్రిలో 'కాయకల్ప' కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ప్రభుత్వ ఆసుపత్రులలో పరిశుభ్రత, ఇన్ఫెక్షన్ నియంత్రణ మరియు రోగులకు అందుతున్న సేవల నాణ్యతను పెంచే లక్ష్యంతో ఈ సమీక్షా కార్యక్రమం జరిగింది. ఈ తనిఖీల్లో భాగంగా రాష్ట్ర స్థాయి నుంచి విచ్చేసిన ఎక్స్‌టర్నల్ అసెసర్స్ (బాహ్య అంచనాదారులు) ఆసుపత్రిలోని ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీ బృందం సభ్యులు: స్వామి అంగోతు – ఎక్స్‌టర్నల్ అసెసర్ డాక్టర్ సాయి కిరణ్ – ఎక్స్‌టర్నల్ అసెసర్ డాక్టర్ ప్రియదర్శిని – ఏ ఎస్ సిఐ (అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా) ప్రతినిధిఈ సందర్శనలో భాగంగా బృందం సభ్యులు ఆసుపత్రిలోని వార్డులు, ఆపరేషన్ థియేటర్, లేబర్ రూమ్ మరియు ఓపీ విభాగాలను సందర్శించి, పరిశుభ్రత ప్రమాణాలను తనిఖీ చేశారు. అనంతరం నిర్వహించిన సమీక్షా సమావేశంలో వారు మాట్లాడుతూ... రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, ఆసుపత్రి ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో సిబ్బంది కృషిని అభినందించారు. కొన్ని విభాగాలలో మరింత మెరుగుదల అవసరమని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ప్రాంతీయ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ , వివిధ విభాగాల వైద్యులు, నర్సింగ్ సిబ్బంది మరియు ఇతర ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

### మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలను

# ఖండిస్తూ బీజేపీ నిరసన



**కరీంనగర్, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కరీంనగర్ పశ్చిమ జోన్ బీజేపీ కార్యకర్తలు స్థానిక శివ థియేటర్ చౌరస్తాలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ దేశ ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, కాంగ్రెస్ పార్టీ వైఖరిని ప్రజలు ఖండిస్తున్నారని పేర్కొన్నారు. ఈ నిరసనలో బీజేపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా పోచమ్మ అమ్మవారి వార్షిక ఉత్సవాలు



**అమరాబాద్, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** అచ్చంపేట పట్టణంలో శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ మహా త్రిపురసుందరీ స్వరూపమైన గ్రామ బొడ్రాయి (నాభిశిల) మరియు పోచమ్మ అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన యజ్ఞంలో పాల్గొన్న అనంతరం బొడ్రాయి ప్రాంతానికి చేరుకున్న ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ దంపతులు, మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాస్ దంపతులు శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రముఖులు, నాయకులు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు కోరుకున్నారు.

### ప్రభుత్వ పాఠశాల గొప్పతనాన్ని

# తెలుపుతూ బడిబాట కార్యక్రమం



**పెద్దపల్లి, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పెద్దపల్లి జిల్లా పెద్దాపూర్ గ్రామంలో బడిబాట కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జెడ్పిహెచ్ఎస్ పెద్దాపూర్ ప్రధానోపాధ్యాయురాలు రాగమఈ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజన్న, హైస్కూల్ ఉపాధ్యాయులు రాజేశం, శ్రీనివాస్ రెడ్డి, బుచ్చిబాబు, గణేష్, శ్రీనివాస్, జగన్, కేశవులు, రాజేష్ రమణతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఉపాధ్యాయులు కోరారు. కార్యక్రమం విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపగా, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం వ్యక్తం చేశారు.

# మార్పు రావాలి

పేదరిక సమాజంలో...!
గురువు మారనంత వరకు
ఎన్ని విద్యాకమిషన్లు వచ్చినా
నేటి విద్యావ్యవస్థ బాగుపడదు

వైద్యులు మారనంత వరకు
నిరుపేదల ఆరోగ్యాలు
ఎప్పటికీ మెరుగుపడవు

నాటి నేలమీది చదువులు
ఉన్నత స్థాయిని చేరుకున్నాయ్

నాటి వైద్యం తరతరాలను
నేటికీ స్మరిస్తూనే జీవిస్తుంది

విద్యా వైద్యమే...!
దేశాభివృద్ధికి మూల సూత్రాలు
అంకిత భావముతో పనిచేయాలి

మార్పు రానంత వరకు
నిరుపేదల జీవితం
బిక్షమే శరణ్యము...!
మరణమే శరణ్యము..!!

డా"జోగు కృష్ణయ్య
రంగారెడ్డి జిల్లా



# రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు జీనియస్ చెస్ అకాడమీ క్రీడాకారులు



**పెద్దపల్లి, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి అమర్చంద్ కళ్యాణమండపంలో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్-7, అండర్-11 చదరంగం పోటీలలో కరీంనగర్ జీనియస్ చెస్ అకాడమీ క్రీడాకారులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అండర్-7 విభాగంలో ఎం. సాన్విత, కే. అద్వైత, ఎన్. సాన్విత, శ్రీ హన్సిత్, కే. శ్రేయాన్స్, ఏ. శ్రేయాన్స్, అండర్-11 విభాగంలో ఎస్. నేహిత, జి. తన్వి, లక్ష్మీ నందిని, ఎన్. అశ్విన్, జటిన్ సిద్ధార్థ, సహర్ష రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. జ్యోతి నగర్‌లో జరిగిన కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు కంకటి కనకయ్య అభినందిస్తూ, ఈనెల 26న హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ కంకటి అనూప్ కుమార్, కో-డైరెక్టర్ కంకటి సుజన్ కుమార్, అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి తాటిపల్లి సతీష్ బాబు, కోచ్‌లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అరెపల్లి పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవం

**అరెపల్లి, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అరెపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ప్రధాన ఉపాధ్యాయుడు రవీందర్ రెడ్డి అధ్యక్షత వహించారు.



ఉపాధ్యాయులు ఓంకార్, సర్పంచ్ గారిడే లక్ష్మీ, ఉప సర్పంచ్ లోమిత రమ్య, పాలకవర్గ సభ్యులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు. జర్నలిస్టు గోరుపాటి శంకర్ విద్యార్థులకు విద్య ప్రాముఖ్యత, సామాజిక బాధ్యతలు వివరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహపరిచాయి.

# వాసవి మాత జయంతి రాష్ట్ర పండుగ

- ఆర్యవైశ్యులలో వెలుగు క్రాంతి



**రంగారెడ్డి, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా రాష్ట్ర పండుగగా ప్రకటించడం పట్ల ఆర్యవైశ్యులలో ఆనందం నెలకొంది. రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ యువజన సంఘం కోశాధికారి, ప్రముఖ సామాజిక కార్యకర్త నీల రవీందర్ మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వాసవి మాత జయంతిని ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట నిలబెట్టుకున్నారు. నేడు అధికారిక జీవో జారీ చేయడం ఆనందదాయకం" అని అన్నారు. ఆర్యవైశ్యుల చిరకాల వాంఛ నెరవేరిందని, దశాబ్దాలుగా కోరుతున్న విన్నపాన్ని ప్రభుత్వం మన్నించడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా ఆర్యవైశ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, ప్రభుత్వానికి రాష్ట్ర ఆర్యవైశ్యుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, "ఈ నిర్ణయం వల్ల భవిష్యత్తులో అమ్మవారి జయంతి వేడుకలు ప్రభుత్వ ఆధ్వర్యంలో మరింత వైభవంగా జరుగుతాయి" అని ఆశాభావం వ్యక్తం చేశారు.

# వేములపల్లిలో ఇందిరమ్మ ఇళ్ళ గృహప్రవేశం



**వేములపల్లి, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కామేపల్లి గ్రామపంచాయతీలో నూతన ఇందిరమ్మ ఇళ్ళ గృహప్రవేశం గురువారం జరిగింది. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి రిబ్బన్ కట్ చేసి ఇళ్ళను ప్రారంభించి, లబ్ధిదారులను సత్కరించారు. లబ్ధిదారులు తమ సొంత ఇంటి కల నెరవేర్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ప్రతి గ్రామంలో నిరుపేదల సొంత ఇంటి కలలు నెరవేరుతున్నాయి. ముఖ్యమంత్రి పేదల సంక్షేమానికి సన్నబియ్యం, ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్ళు వంటి పథకాలు అమలు చేస్తున్నారు" అని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# త్వరలో ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ ప్రారంభం



**ఆమనగల్లు, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఐదు పడకల డయాలసిస్ సెంటర్ మంజూరైనట్లు డీఎంహెచ్ఓ లలితాదేవి తెలిపారు. గురువారం నిర్మాణంలో ఉన్న సిహెచ్‌సి భవనాన్ని పరిశీలించిన ఆమె, త్వరలో నూతన భవనంలో డయాలసిస్ కేంద్రం ప్రారంభమవుతుందని చెప్పారు. దీంతో ఈ ప్రాంత రోగులకు ఊరట లభించనుంది. కార్యక్రమంలో మహేశ్వరం హాస్పిటల్ సూపరింటెండెంట్ నాగేందర్, ఆమనగల్లు సిహెచ్‌సి సూపరింటెండెంట్ నాగరాజు, వైద్యాధికారి మైమున, హెచ్ఈఓ తిరుపతి రెడ్డి, నర్సింగ్ ఆఫీసర్లు, ల్యాబ్ టెక్నీషియన్ వేణు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత మజ్జిగ వితరణ

**కరీంనగర్, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శ్రీ షిరిడి సాయి భక్త భజన మండలి ఆధ్వర్యంలో స్థానిక సివిల్ హాస్పిటల్ సమీపంలో గురువారం ఉచిత మజ్జిగ వితరణ జరిగింది. గౌరవ అధ్యక్షుడు నలుమాచు చంద్రశేఖర్ మాట్లాడుతూ, గత తొమ్మిది సంవత్సరాలుగా వేసవికాలంలో ప్రతి గురువారం పట్టణంలోని వివిధ ప్రదేశాల్లో దాహార్థుల కోసం మజ్జిగ వితరణ చేస్తున్నామని తెలిపారు. అధ్యక్షుడు దగ్గుల మధుసూదన్ దాతల సహకారంతో కార్యక్రమం కొనసాగుతోందని, ఈ గురువారం దాతలుగా వ్యవహరించిన ముద్దసాని శంకర్, రాణికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ రాచమడుగు వనజ వేణు మహేశ్వరరావు, మౌనిక, శివ, నరసయ్య, అనసూయ, పూర్ణ, సాయిరాం, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రామీణ యువతలో దాగిఉన్న ప్రతిభను వెలికితీయాలి







-ఇబ్రహీంపట్నం శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి
-27 ఏళ్లుగా పేదవారికి అంకితభావంతో సేవలందిస్తున్నాం...
-ఎమ్మాస్ మినిస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రెవరెండ్ డాక్టర్ బీసీ పాల్
-కుర్మిద్దలో శిక్షణ పొందిన యువతకు సర్టిఫికెట్ ల ప్రధానం

**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు శిక్షణ ఇచ్చే ప్రోత్సహిస్తే అద్భుతాలను సృష్టిస్తారని వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాలని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. యాచారం మండలం కుర్మిద్ద గ్రామంలోని యంబి కర్మెల్ ప్రార్థనా మందిరంలో గత మూడు సంవత్సరాలుగా యువతీ యువకులకు ఉచితంగా అందిస్తున్న స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా పూర్తి కావడంతో గురువారం సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్ రెడ్డి రంగారెడ్డి శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు సర్టిఫికేట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామీణ యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంగ్లీష్ మరియు కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమని, ఈ శిక్షణతో యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. ప్రతి గ్రామంలో ఇలాంటి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు కావాలని ఆకాంక్షిస్తూ, ప్రభుత్వ పరంగా అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. శిక్షణ పొందిన యువత తమ జీవితాల్లో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఇలాంటి ఉచిత కంప్యూటర్ శిక్షణలు భవిష్యత్తులో మరిన్ని నిర్వహించాలని సూచించారు. అనంతరం చర్చి పాస్టర్, సంఘస్తులను ఎమ్మెల్యే అభినందించారు. అంతకుముందు అంబేద్కర్ జయంతి సందర్భంగా డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యాచారం మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ నీలం శ్రీవిద్య శ్రీరాములు, ఏసిపి కేవీపీ రాజు, సీనియర్ పాస్టర్ రెవరెండ్ జి.డేవిడ్ రాజ్, పాస్టర్ కె.దినాకర్, పాస్టర్ కె.రవీందర్, మాజీ ఉపసర్పంచ్ గోపాలి జోసెఫ్, సంఘం సీనియర్ సభ్యులు కల్లేపల్లి సోమలింగం, పి.పౌలు, జి.లక్ష్మయ్య, జి.రవికుమార్, ఎం.రామచంద్రి, కె.మహేందర్, కె. జాన్, బి.శ్యామ్, పి. రమేష్, టి.కిరణ్, జి.దేవదాస్, జి.కిరణ్, జి.మహేందర్, పి.గణేష్, పి.రమేష్, ఎం.మహేందర్, కె.లాజర్, కె.కృష్ణ, గ్రామ పాలకవర్గ సభ్యులు, సంఘస్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

**27 ఏళ్లుగా పేదవారికి అంకితభావంతో సేవలందిస్తున్నాం..**

-ఎమ్మాస్ మినిస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రెవరెండ్ డాక్టర్ బీసీ పాల్

కందుకూరు ప్రాంతంలో ఎమ్మాస్ మినిస్ట్రీస్ గత 27 సంవత్సరాలుగా పేదవారి అభివృద్ధి కోసం నిరంతర సేవలు అందిస్తున్నట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రెవరెండ్ డాక్టర్ బీసీ పాల్ తెలిపారు. సమాజంలోని పేద మరియు వెనుకబడిన వర్గాల జీవితాలను మెరుగుపరచడమే లక్ష్యంగా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎమ్మాస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ శిక్షణ, ఉచిత కంప్యూటర్ విద్య, ఉచిత వైద్య శిబిరాలు వంటి పలు కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అదనంగా, అనాథ పిల్లల కోసం అనాథాశ్రమాన్ని ఏర్పాటు చేసి వారికి ఆశ్రయం కల్పిస్తూ, వారి భవిష్యత్తును నిర్మించేందుకు కృషి చేస్తున్నారు. యాచారం మండలం కురుమిద్ద గ్రామంలో కూడా సంస్థ సేవలను విస్తరించింది. అక్కడ అనాథ పిల్లల కోసం ప్రత్యేక అనాథాశ్రమం ఏర్పాటు చేయడంతో పాటు, ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రం మరియు స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల ద్వారా గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించడమే లక్ష్యమని డైరెక్టర్ బీసీ పాల్ వివరించారు. అలాగే, మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాలను కూడా ప్రారంభించామని ఆయన తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తరించి, బీదవారి అభివృద్ధికి తమవంతు సహకారం కొనసాగిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏమ్మాస్ మినిస్ట్రీస్ వైస్ ప్రెసిడెంట్ రెవరెండ్ డాక్టర్ ఎస్.దేవకుమార్, క్రిస్టఫర్ సత్యరాజ్, ట్రేజరర్ కె.ఆనంద్ ప్రేమ్ రాజ్, తదితరులున్నారు.

## విద్యార్థుల అభివృద్ధికి తల్లి దండ్రుల పాత్ర కీలకం: కలెక్టర్



**మహబూబాబాద్, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో గురువారం పేరెంట్స్--టీచర్స్ మీటింగ్ జరిగింది.జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ముఖ్య అతిథిగా పాల్గొని, “ప్రతి విద్యార్థి చదువుతోనే గొప్ప స్థాయికి చేరుకోవాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయం అవసరం. పిల్లలకు నైపుణ్యం ఉన్న సబ్జెక్టులో పట్టు పెంచేలా చర్యలు తీసుకోవాలి” అని సూచించారు.ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, చదువుతో పాటు క్రీడలు, నైతిక విలువలు నేర్పాలని తల్లిదండ్రులకు సూచించారు.కలెక్టర్ తరగతి గదులు, లైబ్రరీ, మరుగుదొడ్లు, తాగునీటి వసతులను పరిశీలించి, విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు.కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీమన్నారాయణ రెడ్డి, ఎంఈఓ, ఎంపీడీఓ, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన వెల్దండ విద్యార్థులు



కొమ్ము హన్సిక



దాసరి అఖిల

**వెల్దండ, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండలంలోని చొక్కన్నపల్లి గ్రామానికి చెందిన కొమ్ము హన్సిక, మండల కేంద్రానికి చెందిన దాసరి అఖిల జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచారు.వారి తల్లిదండ్రులు కొమ్ము యాదమ్మ--నాగయ్య, లిదాసరి లింగమయ్య (బద్రి)లిలు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామస్తులు విద్యార్థులను అభినందిస్తూ, ఉన్నత చదువులు పూర్తి చేసి గొప్ప పదవులు చేపట్టి గ్రామానికి, జిల్లాకు, రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తేవాలని ఆకాంక్షించారు.తల్లిదండ్రులు అందించిన అభినందనలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## రైతులకు లాభదాయక వంగడాలు అభివృద్ధి చేయాలి: కలెక్టర్



**నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ గురువారం పాలెంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో జరిగిన వ్యవసాయ పరిశోధన--విస్తరణ సలహా సంఘ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “రైతుల సమస్యలకు శాస్త్రవేత్తలు, అధికారులు సమన్వయంతో పరిష్కారాలు కనుగొనాలి. వాతావరణ మార్పులను తట్టుకునే పంటలు, లాభదాయక వంగడాలను అభివృద్ధి చేయాలి. పర్యావరణానికి అనుకూలమైన పద్ధతులను అవలంబించాలి” అని సూచించారు.ప్రాంతీయ కేంద్ర సంచాలకుడు డా. ఎల్. కృష్ణ వరి, వేరుశనగ, సెనగ పంటల్లో సాధించిన పురోగతిని వివరించారు. ఆర్‌ఎన్‌ఆర్ 25105, 31479 వంటి అధిక దిగుబడి వరి వంగడాల ప్రాధాన్యతను చెప్పారు. డా. బలరాం చలి, ఎండలను తట్టుకునే పంట రకాల అభివృద్ధి, ప్రత్యామ్నాయ పంటల విస్తరణపై దృష్టి సారించాలని సూచించారు.శాస్త్రవేత్తలు భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం, చిరుధాన్యాల ప్రోత్సాహం, డిజిటల్ వ్యవసాయం ప్రాధాన్యతను వివరించారు. రైతు విజ్ఞాన కేంద్రాలు సాంకేతిక పరిజ్ఞానం గ్రామస్థాయికి చేరేలా చేస్తున్న కృషిని వివరించారు.ఈ సమావేశంలో 200కి పైగా శాస్త్రవేత్తలు, 12 జిల్లాల అధికారులు, నాబార్డ్, ఐకార్ ప్రతినిధులు పాల్గొని 2026--27 వ్యవసాయ ప్రణాళికలకు కీలక సూచనలు అందించారు.

# జయ్ క్రికెట్ టోర్నీ విజేత ఎలిగేడు




విన్నర్ నగదు బహుమతి తో పాటు షీల్డ్ అందజేస్తున్న ఎలిగేడు సర్పంచ్ కప్పల ప్రవీణ్, నర్సాపూర్ సర్పంచ్ పల్లెర్ల వెంకటేష్.



టాస్ వేసి మ్యాచ్ ప్రారంభిస్తున్న పెద్దపెల్లి జిల్లా బీసీ జేఏసీ చైర్మన్ దాసరి ఉష

**ఎలిగేడు, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండల కేంద్రంలో పది రోజుల పాటు జరిగిన జయ్ క్రికెట్ టోర్నీ ఫైనల్‌లో ఎలిగేడు, శివపల్లి జట్లు తలపడ్డాయి.ఫైనల్ మ్యాచ్‌ను బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష ప్రారంభించారు. ఎలిగేడు జట్టు విజేతగా నిలిచి షీల్డ్‌తో పాటు రూ.10 వేల బహుమతి అందుకుంది. శివపల్లి జట్టు రన్నరప్‌గా నిలిచి రూ.5 వేల బహుమతి పొందింది.కార్యక్రమంలో సర్పంచ్ కప్పల ప్రవీణ్, ఉపసర్పంచులు ముంజం నరేశ్, అనిల్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, మాజీ ఉపసర్పంచి కోరుకంటి వెంకటేశ్వరరావు, బూర్ల సత్యం, ఆర్గనైజర్లు బాసంపల్లి వినోద్‌కుమార్, గోస్కి అక్షయ్ కుమార్, అల్లి రమేశ్, క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## జన సందేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్లు విజయవంతం



**మంచాల, ఏప్రిల్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జన సందేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంచాల గ్రామం నుండి 6 మంది, నోముల గ్రామం నుండి 5 మంది మొత్తం 11 మందికి సాధురం ఐ హాస్పిటల్‌లో కంటి ఆపరేషన్లు నిర్వహించారు. డాక్టర్ ఎమ్మెస్ రెడ్డి పర్యవేక్షణలో, ఫౌండేషన్ అధినేత గోగిరెడ్డి లచ్చిరెడ్డి, క్యాంప్ కోఆర్డినేటర్ అశ్వాల బాల్ రాజ్, వైద్యుల బృందం దివ్య, జలజ, మంజుల ఆధ్వర్యంలో ఆపరేషన్లు విజయవంతంగా పూర్తయ్యాయి.ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడమే కాక, కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి కొత్త వెలుగు చూపించిందని నిర్వాహకులు తెలిపారు.

## చర్లపల్లి డివిజన్ కు 5 కోట్ల 9 లక్షల నిధుల మంజూరు



**నాగారం, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కృషి ఫలితంగా చర్లపల్లి డివిజన్ కి మరో సారి భారీగా నిధులు మంజూరు అయ్యాయి. గ్రేవీ యార్డ్ టూ చిన్న చర్లపల్లి సిల్వర్ ఓక్ విల్లాస్ బాక్స్ డ్రైన్ కోటి 98 లక్ష రూపాయలు. ఈసీ నగర్ ఆర్‌ఆర్ డ్రైన్ బాక్స్ టూ బాక్స్ డ్రైన్ కోటి 98 లక్ష రూపాయలు. రైల్ విహార్ టూ ఈసీ నగర్ డ్రైన్ 47 లక్ష రూపాయలు. చర్లపల్లి లేక్ టూ సిల్వర్ ఓక్ బంగ్లాస్ 66 లక్ష రూపాయలు నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు.

## సర్పంచ్ కు వినతిపత్రం అందచేసిన ఆశా వర్కర్లు



**ఎలిగేడు, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తక్కువ జీతాలతో ఇబ్బందులు పడుతున్నామని, జీతాలను పెంచాలని కోరుతూ గురువారం ఆశా వర్కర్లు ఎలిగేడు సర్పంచ్ కప్పల ప్రవీణ్కు వినతిపత్రం అందజేశారు.సర్పంచ్ ప్రవీణ్ స్పందిస్తూ, “ఈ సమస్యను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు దృష్టికి తీసుకెళ్లి, ఆయన ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తాను” అని తెలిపారు.కార్యక్రమంలో ఆశా వర్కర్లు స్వప్న, పద్మ పాల్గొన్నారు.

## రాష్ట్ర రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

**నిర్మల్ ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వాసవికన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతిని రాష్ట్ర పండుగ జీవో విడుదల చేసిన సందర్భంగా నిర్మల్ ఆర్యవైశ్య సంఘం తెలంగాణ రాష్ట్ర రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ...వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ఆర్యవైశ్య సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఆరుట్ల మోడల్ స్కూల్‌లో నూతన ప్రధానోపాధ్యాయుడు బాధ్యతలు స్వీకరణ



**ఆరుట్ల, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ మోడల్ స్కూల్ ఆరుట్లలో ప్రధానోపాధ్యాయుడిగా జిలవర్ష రాములు గురువారం పూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఆయనకు హార్దిక స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.రాములు మాట్లాడుతూ పాఠశాలలో నాణ్యమైన విద్య అందించడమే తన ప్రధాన లక్ష్యమని, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి క్రమశిక్షణ, సాంకేతిక విద్య, నైతిక విలువల పెంపుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, విద్యా సిబ్బంది రాములకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల భాషా దినోత్సవం



**హయత్‌నగర్, ఏప్రిల్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల శాఖ ఆధ్వర్యంలో ఆంగ్ల భాషా దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థుల చురుకైన భాగస్వామ్యంతో వక్తృత్వం, చర్చా పోటీలు జరిగి, పాల్గొన్న వారు తమ మాట్లాడే నైపుణ్యం, ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శించారు. విజేతలకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసి విద్యార్థుల్లో పఠన సంస్కృతిని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఆంగ్ల శాఖ, కెరీర్ గైడెన్స్ ఽ ప్లేస్‌మెంట్ సెల్, తెలంగాణ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్లు కలిసి మలక్‌పేట్‌లోని వీసా ఐ20 ఓవర్సీస్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. దీని ద్వారా విద్యార్థులకు విదేశీ విద్య, కెరీర్ పురోగతి, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు లభించనున్నాయి. ప్రిన్సిపాల్ పి. సురేష్ బాబు ఇంగ్లిష్ శాఖను అభినందిస్తూ విద్యార్థులు అన్ని కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని తమ సంభాషణా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డా. ధర్మపురి మధు, డా. డి. మక్లా, డా. పి. విజయలక్ష్మి, పి. విద్యాసాగర్, డా. కృష్ణ మోహన్, డా. ప్రవీణ్ తో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.